

ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా రిపబ్లిక్

తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి

9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -166 | పేజీలు - 8 | వెల ₹03/- | బుధవారం 23 సెప్టెంబర్ 2026



చిన్న వ్యాపారులపై భారం లేనట్లే!

యూపీఐ ఛార్జీలపై ఎన్‌పీసీఐ కీలక ప్రకటన..

యూపీఐ ఎండీఆర్‌పై జీఎస్టీ భారం అంటూ వస్తున్న వార్తలు అవాస్తవం

రూ.2,000 లోపు లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు, జీఎస్టీ ఉండదని స్పష్టీకరణ

నెలకి లక్ష లోపు యూపీఐ వసూళ్లున్న వ్యాపారులపై ప్రభావం శూన్యమని వెల్లడి

వ్యక్తుల మధ్య జరిగే లావాదేవీలు యథాతథంగా పూర్తిగా ఉచితమని స్పష్టత

చెల్లించిన జీఎస్టీని ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ కింద సర్దుబాటు చేసుకోవచ్చన్న ఎన్‌పీసీఐ

వైభవం దిశగా పురపాలికలు

123 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో రూ.11,359 కోట్ల పనులకు శ్రీకారం



కుప్పం నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం

రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 22,330 కోట్ల పనులు

మరో 6 నెలల్లో ఇంకో 17 వేల కోట్ల పనులు

మొత్తం రూ.50 వేల కోట్లతో చేపడుతున్నాం

ఇవి పూర్తయితే రాష్ట్రం దశ-దిశ మారతాయ్

మున్సిపల్ చరిత్రలో ఇది సువర్ణ అధ్యాయం

2047 నాటికి ప్రతిదీ 'స్వర్ణ మున్సిపాలిటీ'యే

కుప్పం/అమరావతి,సెప్టెంబర్ 22 (రిపబ్లిక్ న్యూస్):
రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు పట్టణాలే గ్రోత్ ఇంజన్లుగా మారుతున్నాయని సీఎం చంద్రబాబు అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రజాప్రతినిధులు, అధికారులు ఆ దిశగా కృషి చేయాలని సూచించారు. రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో రూ.11,359 కోట్ల విలువైన అభివృద్ధి పనులను మంగళవారం కుప్పం నుంచి ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. భారీ ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టి పురపాలక చరిత్రలో సువర్ణ అధ్యాయాన్ని లిఖించామని చెప్పారు. 'రెండేళ్లుగా సంక్లిష్ట పరిస్థితుల్ని అధిగమిస్తూ **మిగతా 2లో...**

ఆసియా క్రీడలు 2026లో

భారత్‌కు తొలి స్వర్ణం



మహిళల క్రికెట్ ఫైనల్లో శ్రీలంకపై 147 పరుగుల తేడాతో విజయం

దేశం గర్విస్తోందంటూ జట్టును అభినందించిన ప్రధాని మోదీ

చారిత్రక విజయమంటూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంస

ఢిల్లీ సెప్టెంబర్ 22 (రిపబ్లిక్ న్యూస్):
ఆసియా క్రీడలు-2026లో భారత్ స్వర్ణ పతకాల ఖాతాను ఘనంగా ప్రారంభించింది. భారత మహిళా క్రికెట్ జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచి, ఈ ఎడిషన్‌లో దేశానికి తొలి బంగారు పతకాన్ని అందించింది. ఫైనల్ పోరులో శ్రీలంకను 147 పరుగుల భారీ తేడాతో ఓడించి, వరుసగా రెండోసారి స్వర్ణాన్ని కైవసం చేసుకుంది. హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమ్‌ఇండియా టోర్నీ ఆద్యంతం తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. **మిగతా 2లో...**

వైభవంగా జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవం..

తెలుగు చిత్రాలకు 9 అవార్డులు



ఢిల్లీ సెప్టెంబర్ 22 (రిపబ్లిక్ న్యూస్):
ప్రతిష్ఠాత్మకమైన 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవం గుజరాత్‌లో వైభవంగా జరిగింది. రాష్ట్రంలోని స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గుజరాత్‌లో అవార్డు ప్రదానోత్సవం జరగడం ఇదే తొలిసారి. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పలువురు సినీకళాకారులు పురస్కారాలు అందుకున్నారు. **మిగతా 2లో...**

వందేమాతరం పాడనంత మాత్రాన క్రిమినల్ చర్యలొద్దు

మతపరమైన, మనస్సాక్షికి సంబంధించిన అభ్యంతరాలకు రక్షణ

జాతీయ గీతంగా వందేమాతరం హోదాను ప్రశ్నించలేమని స్పష్టీకరణ

గాయకుడు టీఎం కృష్ణ పిటిషన్‌పై విచారణ సందర్భంగా కీలక వ్యాఖ్యలు

ఢిల్లీ సెప్టెంబర్ 22 (రిపబ్లిక్ న్యూస్):
వందేమాతరం గీతాన్ని ఆలపించలేదన్న కారణంతో వ్యక్తులపై క్రిమినల్ చర్యలు తీసుకోవడానికి వీల్లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. మతపరమైన విశ్వాసాలు లేదా మనస్సాక్షికి సంబంధించిన కారణాలతో ఎవరైనా ఈ గీతాన్ని **మిగతా 2లో...**



రౌడీ బ్యాచ్‌ని వదిలిపెట్టం

డేట్, టైమ్ ఫిక్స్ చేసుకొని మాట్లాడుకుందాం.. - వైసీపీకి మంత్రి నారా లోకేశ్ సవాల్

ఎక్కడున్నా పట్టుకొచ్చి జైల్లో వేస్తామని హెచ్చరిక

తనపై కోపం ఉంటే నేరుగా తేల్చుకోవాలని సవాల్

డీఎస్సీ, ఏపీపీఎస్సీ, కల్తీ మద్యంపై చర్చకు సిద్ధమని వెల్లడి

150 రోజుల్లో 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశామన్న లోకేశ్

కార్యకర్తల కోసం ప్రమాద బీమా, రూ.175 కోట్ల సాయం

రాప్తాడు సెప్టెంబర్ 22 (రిపబ్లిక్ న్యూస్):
ఉపాధ్యాయులపై దాడికి పాల్పడిన వారిలో ఏ ఒక్కరినీ వదిలిపెట్టబోమని టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఏపీలోనే కాదు.. అండమాన్, **మిగతా 2లో...**



అక్రమాస్తుల కేసులో నిమ్స్ అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ అరెస్ట్



నిమ్స్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీభాస్కర్‌పై ఏసీబీ దాడులు

రూ.80 కోట్లకు పైగా విలువైన ఆస్తులను గుర్తించిన అధికారులు

హైదరాబాద్, విశాఖ, ఇతర ప్రాంతాల్లో ఫ్లాట్లు, ప్లాట్లు, బంగారం

బ్యాంకుల్లో రూ.41 లక్షల నగదు, ప్రైవేటు సంస్థల్లో రూ.35 లక్షల పెట్టుబడులు

20 ఏళ్లుగా నిమ్స్‌లో పనిచేస్తున్న లక్ష్మీభాస్కర్‌పై గతంలోనూ ఆరోపణలు

హైదరాబాద్ సెప్టెంబర్ 22 (రిపబ్లిక్ న్యూస్):
హైదరాబాద్‌లోని ప్రతిష్టాత్మక నిమ్స్ ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నోరి లక్ష్మీభాస్కర్ నివాసంలో భారీగా ఆస్తులు వెలుగుచూశాయి. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలతో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మంగళవారం ఏకకాలంలో ఆయన నివాసం, కార్యాలయంతో పాటు మరో ఏడు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు రూ .80 కోట్లకు పైగా విలువైన స్థిర, చరాస్తులను **మిగతా 2లో...**

250 మందికి పైగా వైసీపీ నేతలపై కేసులు నమోదు

టీచర్లపై వైసీపీ దాడులు.. జోగి రమేశ్, వెల్లంపల్లి, దేవినేని అవినాశ్ తదితరులపై కేసులు



విజయవాడ సెప్టెంబర్ 22 (రిపబ్లిక్ న్యూస్):
విజయవాడలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) కార్యాలయం ఎదుట టీచర్లపై వైసీపీ నాయకులు, శ్రేణులు జరిపిన భౌతిక దాడి ఉదంతాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణించింది. **2లో...**

ఈ సారీ 100 శాతం స్ట్రయిక్ రేట్

బలంగా ఉన్న చోటే పోటీ

స్థానిక సంస్థల ఎన్నికలపై జనసేన రాష్ట్రస్థాయి సన్నాహక భేటీలో పవన్

మనల్ని పదవుల్లో కూర్చోబెట్టింది జనసైనికులు..

వారికి సీట్లివ్వండి

వైసీపీ ప్రలోభాలకు లొంగొద్దు..

ఫ్రెండ్లీ పోటీ ఉంటే పోటీ చేయండి..

పిఠాపురంలో రూ.1,500 కోట్ల అభివృద్ధి పండుగ

: నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతామన్న పవన్



కాకినాడ,సెప్టెంబర్ 22 (రిపబ్లిక్ న్యూస్):
రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన సిద్ధంగా ఉండాలని, పోటీచేసిన ప్రతిచోటా(100 శాతం స్ట్రయిక్ రేట్) విజయం సాధించేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పిలుపునిచ్చారు. కూటమికి చెడ్డపేరు తెచ్చేలా పార్టీ నేతలెవరూ వ్యవహరించవద్దని స్పష్టం చేశారు. బలం ఉన్న స్థానాల్లోనే పోటీ చేయాలని, వైసీపీ ప్రలోభాలకు లొంగి బలం లేనిచోట కూడా పోటీకి ప్రయత్నాలు చేయవద్దని దిశానిర్దేశం చేశారు. **మిగతా 2లో...**

జూరాలకు నీళ్లివ్వండి..



కర్ణాటక సీఎంకు రేవంత్ ఫోన్

జూరాలకు 5 టీఎంసీల నీరు ఇవ్వాలని కోరిన రేవంత్

శివకుమార్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం

బెంగళూరులో శివకుమార్‌తో మంత్రులు, ఎమ్మెల్యేల భేటీ

విడతల వారీగా నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి

జూరాల నీటి కోసం రైతుల ఆందోళన

హైదరాబాద్ (రిపబ్లిక్ న్యూస్):
ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగునీటి సమస్యపై సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. జూరాల ప్రాజెక్టుకు ఐదు టీఎంసీల నీటిని విడుదల చేయాలని కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌ను కోరారు. **2లో...**

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888

ఆసియా క్రీడలు 2026లో భారత్‌కు తొలి స్వర్ణం

మొదటిపేజీ తరువాయి

ఈ చారిత్రక విజయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందిస్తూ జట్టుకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. "భారత క్రికెట్‌కు ఇదొక అద్భుతమైన విజయం. మన క్రీడాకారిణులు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించడం అభినందనీయం. వారి ఆత్మవిశ్వాసం, నైపుణ్యం, సమష్టి కృషి అమోఘం. ఈ విజయంతో దేశం గర్విస్తోంది. మీరు యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలిచారు" అని మోదీ ప్రశంసించారు. మరోవైపు ఆసియా క్రీడల్లో తొలిసారిగా ప్రవేశపెట్టిన ఎంఎంఏ విభాగంలో పతకం సాధించిన సుచికా తరియల్‌ను కూడా ప్రధానమంత్రి అభినందించారు.రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సైతం భారత జట్టును అభినందించారు. ఈ విజయం చరిత్రలో నిలిచిపోతుందని, రాబోయే తరాలకు, ముఖ్యంగా దేశంలోని యువతకు ఇది గొప్ప స్ఫూర్తిదాయకమని కొనియాడారు. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండుల్కర్ స్పందిస్తూ, షఫాలీ వర్మ, స్మృతి మంధానల అద్భుత భాగస్వామ్యాన్ని, బౌలర్ల ప్రతిభను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ చారిత్రక విజయంతో భారత మహిళా జట్టుపై దేశవ్యాప్తంగా ప్రశంసల వర్షం కురుస్తోంది.

జూరాలకు నీళ్లివ్వండి..

మొదటిపేజీ తరువాయి



మంగళవారం ఫోన్‌లో మాట్లాడిన రేవంత్‌రెడ్డి.. జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను ఆయనకు వివరించారు.జూరాల నుంచి సాగునీరు అందక ఇప్పటికే సాగు చేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందని తెలిపారు. రైతుల పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఐదు టీఎంసీల నీటిని జూరాలకు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై శివకుమార్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.
రేవంత్‌రెడ్డి ఆదేశాలతో మంత్రులు జూపల్లి కృష్ణారావు, శ్రీహరి, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మేగా రెడ్డి, జి. మధుసూదన్‌రెడ్డి మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిశారు. కర్ణాటక సీఎంతో చర్చించాల్సిన అంశాలపై వారితో మాట్లాడారు.
అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు బెంగళూరుకు బయలుదేరారు. మంగళవారం రాత్రి 8 గంటలకు శివకుమార్‌తో భేటీ కానున్నారు. జూరాలకు నీరు ఇచ్చేందుకు సానుకూలంగా స్పందించినందుకు ఆయనకు కృతజ్ఞతలు చెప్పనున్నారు. ఐదు టీఎంసీల నీటిని ఒకేసారి కాకుండా విడతల వారీగా విడుదల చేయాలని కోరనున్నారు.జూరాలకు సాగునీరు విడుదల చేయాలని కోరుతూ రైతులు ఇప్పటికే ఆందోళనకు దిగారు. ఈ ఆందోళనలకు బీఆర్ఎస్ మద్దతు ప్రకటించింది. బీజేపీ కూడా ఈ అంశంపై స్పందించింది. దీంతో జూరాల నీటి వ్యవహారం రాజకీయంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది.

వందేమాతరం పాడనంత మాత్రాన క్రిమినల్ చర్యలొద్దు

పాడటానికి నిరాకరిస్తే, వారిపై ఎటువంటి శిక్షార్హమైన చర్యలు ఉండబోవని అత్యున్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. అదే సమయంలో, జాతీయ గీతంగా వందేమాతరం హోదాను న్యాయస్థానాలు సమీక్షించలేవని కూడా స్పష్టం చేసింది.ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసుడు టీఎం కృష్ణ దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఈ సందర్భంగా పలు కీలక వ్యాఖ్యలు చేసింది. వందేమాతరంలోని ఆరు చరణాలను ఆలపించాలన్న కేంద్ర ప్రభుత్వ సర్క్యులర్‌ను, అలాగే జాతీయ చిహ్నాలను అవమానించకుండా నిరోధించే చట్టం-2026 సవరణను టీఎం కృష్ణ సవాల్ చేశారు. గీతంలోని చివరి నాలుగు చరణాలలో హిందూ దేవతల ప్రస్తావన ఉండటం రాజ్యాంగబద్ధమైన లౌకిక స్ఫూర్తికి, మత స్వేచ్ఛకు విరుద్ధమని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు.విచారణ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ, "వందేమాతరం సుదీర్ఘ కాలంగా జాతీయ గీతంగా కొనసాగుతోంది, దాని హోదాను మేము ప్రశ్నించలేము" అని వ్యాఖ్యానించింది. అయితే, ఆర్టికల్స్ 25, 26 ప్రకారం మత విశ్వాసాలు లేదా వ్యక్తిగత విచక్షణ కారణంగా ఎవరైనా ఈ గీతాన్ని పాడటానికి అభ్యంతరం వ్యక్తం చేస్తే, వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. వ్యక్తులు తమ ఇష్టానుసారం ఒకటి లేదా అంతకంటే ఎక్కువ చరణాలను పాడవచ్చని లేదా అస్సలు పాడకుండా ఉండవచ్చని కోర్టు అభిప్రాయపడింది.
1986 నాటి చరిత్రాత్మక బిజో ఇమ్మాన్యుయేల్ కేసులో, మత విశ్వాసాల కారణంగా జాతీయ గీతాన్ని పాడలేమని కోరిన జెహోవా సాక్షుల విభాగానికి చెందిన విద్యార్థులకు సుప్రీంకోర్టు రక్షణ కల్పించిన విషయాన్ని ఈ సందర్భంగా ధర్మాసనం గుర్తు చేసింది. ప్రాథమిక హక్కులను ప్రాథమిక విధులు అధిగమించలేవని ఆ తీర్పు స్పష్టం చేసిందని పేర్కొంది. ప్రస్తుత పిటిషన్‌లో కేవలం క్రిమినల్ చర్యలకు సంబంధించిన అంశాన్ని మాత్రమే పరిశీలిస్తామని, గీతంలోని సాహిత్యంపై లేదా దాని అధికారిక హోదాపై ఎటువంటి తీర్పు ఇవ్వబోమని న్యాయస్థానం వెల్లడించింది.

వైభవంగా జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవం..

మొదటిపేజీ తరువాయి

ప్రముఖ కన్నడ నటుడు అనంత్ నాగ్ దాదా సాహెబ్ ఫాల్కే అవార్డును రాష్ట్రపతి చేతులమీదుగా అందుకున్నారు.మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి, బాలీవుడు నటుడు కార్తిక్ ఆర్యన్ సంయుక్తంగా ఉత్తమ నటుడి అవార్డును అందుకున్నారు. చందూ ఛాపియన్ చిత్రానికి కార్తిక్ ఆర్యన్‌ను, భ్రమయుగం చిత్రానికి మమ్ముట్టిని ఈ అవార్డు వరించింది. కల్కి 2898 ఏడీ ప్రజాదరణ పొందిన ఉత్తమ చిత్రంగా నిలిచింది. ఉత్తమ చిత్రంగా ఆర్టికల్ 370 నిలిచింది. ఆ చిత్రంలో నటించిన యామీ గౌతమ్ ఉత్తమ నటిగా అవార్డు అందుకున్నారు. అమరన్ చిత్రానికి ఉత్తమ దర్శకుడిగా రాజ్‌కుమార్ పెరియసామి అవార్డును అందుకున్నారు. ఈసారి తెలుగు సినిమాలు కూడా సత్తా చాటాయి. 'కల్కి 2898'తో పాటు 'కమిటీ కుర్రోళ్లు', '35.. చిన్న కథ కాదు', 'పుష్ప-2', 'లక్కీ భాస్కర్' సహా పలు చిత్రాలు వివిధ విభాగాల్లో మొత్తం 9 అవార్డులను సొంతం చేసుకున్నాయి.చలనచిత్ర అవార్డుల ప్రదాన కార్యక్రమం సాధారణంగా ఢిల్లీలో విజ్ఞాన్ భవన్‌లో జరుగుతున్న విషయం తెలిసిందే. 1954 నుంచి ఈ వేదికగానే అవార్డు ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 1971లో ఓసారి మాత్రమే చెన్నైలో జరిగింది. ఇక కరోనా సమయంలో రెండేళ్ల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించలేదు.

అక్రమాస్తుల కేసులో నిమ్స్ అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ అరెస్ట్

మొదటిపేజీ తరువాయి

గుర్తించడంతో అధికారులు విస్తుపోయారు.ఏసీబీ గుర్తించిన ఆస్తుల వివరాల ప్రకారం, కూకట్‌పల్లిలో రెండు విలాసవంతమైన ఫ్లాట్లు, మణికొండ, పేట్ బషీరాబాద్ ప్రాంతాల్లో మరో ఐదు ఫ్లాట్లు ఉన్నాయి. వీటితో పాటు యాదాద్రి, నందిగామ, శామీర్‌పేటలో నాలుగు ఓపెన్ ప్లాట్లు, విశాఖపట్నంలో 800 గజాల స్థలం ఉన్నట్లు తేలింది. అలాగే, వివిధ బ్యాంకు ఖాతాల్లో రూ. 41 లక్షల నగదు, పోస్టాఫీసు ఖాతాల్లో రూ. 12 లక్షల డిపాజిట్లు, ఒక ప్రైవేటు సంస్థలో రూ. 35 లక్షల పెట్టుబడులు ఉన్నట్లు అధికారులు కనుగొన్నారు. వీటితో పాటు 517 గ్రాముల బంగారం, మూడు కార్లు, నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.డాక్టర్ లక్ష్మీభాస్కర్ గత 20 ఏళ్లుగా నిమ్స్‌లో పనిచేస్తుండగా, గత ఐదేళ్లుగా డిప్యూటీ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయనపై గతంలోనూ పలు ఆరోపణలు వచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం ఏసీబీ అధికారులు లభ్యమైన ఆస్తుల పూర్తి విలువను అంచనా వేసే పనిలో నిమగ్నమయ్యారు.

250 మందికి పైగా వైసీపీ నేతలపై కేసులు నమోదు

మొదటిపేజీ తరువాయి

సమాజానికి దిశానిర్దేశం చేసే గురువులపై దౌర్జన్యాలు, భౌతిక దాడులు చేయడాన్ని ఏమాత్రం సహించేది లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత స్పష్టం చేశారు. ఈ ఘటనకు పాల్పడిన బాధ్యులందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజయవాడ పోలీస్ కమిషనర్‌ను సీఎం ఆదేశించారు.దీనిపై వేగంగా స్పందించిన పోలీసులు విజయవాడలోని సూర్యారావుపేట, మాచవరం, కృష్ణలంక పోలీస్ స్టేషన్లలో కలిపి మొత్తం 6 క్రిమినల్ కేసులు నమోదు చేశారు. 250 మందికి పైగా వైసీపీ నాయకులు, శ్రేణులు, రౌడీషీటర్లపై హత్యాయత్నం, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం, విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై దాడి, చట్టవిరుద్ధంగా గుమిగూడటం వంటి తీవ్రమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. కేసులు నమోదైన వారిలో మాజీ మంత్రులు జోగి రమేశ్, వెల్లంపల్లి శ్రీనివాస్, నేతలు జక్కంపూడి రాజా, దేవినేని అవినాశ్, పేర్ని కిట్టు, నాగార్జున యాదవ్ తదితరులు ఉన్నారు.
మరోవైపు వైపు, వైసీపీ విద్యార్థి విభాగం నాయకుడు రవిచంద్రను పోలీసులు ఇప్పటికే అరెస్టు చేసి మాచవరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దాడిలో పాల్గొన్న పలువురు రౌడీషీటర్లను పట్టుకోవడానికి ప్రత్యేక పోలీస్ బృందాలు గాలిస్తున్నాయి.

చిన్న వ్యాపారులపై భారం లేనట్లే!

యూపీఐ ఛార్జీలపై ఎన్‌పీసీఐ కీలక ప్రకటన..

ఢిల్లీ సెప్టెంబర్ 22 (రిపబ్లిక్ న్యూస్):

యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా చేసే చెల్లింపుల్లో మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) పై జీఎస్టీ విధిస్తారని, దీనివల్ల డిజిటల్ చెల్లింపులు ఖరీదుగా మారతాయని, ముఖ్యంగా చిన్న వ్యాపారులపై భారం పడుతుందని కొన్ని మీడియా మాధ్యమాలలో వస్తున్న వార్తలను 'నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా' (ఎన్‌పీసీఐ) ఖండించింది. ఈ ఆందోళనలు పూర్తిగా అవాస్తవమని, అపోహలు మాత్రమేనని ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.ఎన్‌పీసీఐ వివరణ ప్రకారం, ఎండీఆర్ అనేది కేవలం రూ.2,000 కంటే ఎక్కువ విలువైన 'పర్సన్-టు-మర్చంట్' (పీ2ఎం) లావాదేవీలకు మాత్రమే వర్తిస్తుంది. రూ.2,000 వరకు జరిపే లావాదేవీలకు ఎలాంటి ఎండీఆర్ లేనందున, వాటిపై జీఎస్టీ ప్రభావం కూడా ఉండదని స్పష్టం చేసింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం దేశంలో జరిగే మొత్తం యూపీఐ మర్చంట్ లావాదేవీల్లో 96% పైగా రూ.2,000 లోపువేనని, అందువల్ల అత్యధిక లావాదేవీలపై ఈ మార్పు ప్రభావం ఏమాత్రం ఉండదని పేర్కొంది.
అంతేకాకుండా, నెలకు లక్ష రూపాయల వరకు యూపీఐ ద్వారా చెల్లింపులు స్వీకరించే చిన్న వ్యాపారులు ఎండీఆర్ చెల్లించాల్సిన అవసరం లేదని, కాబట్టి వారికి జీఎస్టీ సమస్యే ఉత్పన్నం కాదని తెలియజేసింది. ఒకవేళ రూ.2,000 పైబడి లావాదేవీలు జరిపి ఎండీఆర్ చెల్లించే వ్యాపారులు దానిపై జీఎస్టీ కట్టినా, ఆ మొత్తాన్ని వారు విక్రయించే వస్తువులపై చెల్లించాల్సిన జీఎస్టీ నుంచి మినహాయింపు (ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్) పొందవచ్చని వివరించింది. ఫలితంగా, వ్యాపారులపై ఈ జీఎస్టీ భారం వాస్తవానికి ఉండదని ఎన్‌పీసీఐ స్పష్టం చేసింది.
వ్యక్తుల మధ్య జరిగే 'పర్సన్-టు-పర్సన్' (పీ2పీ) లావాదేవీలపై ఈ నిబంధనల ప్రభావం ఏమాత్రం ఉండదని కేంద్ర ఆర్థిక శాఖ ఇదివరకే స్పష్టం చేసింది. ఎంత మొత్తం బదిలీ చేసినా ఈ లావాదేవీలు ఎప్పటిలాగే పూర్తిగా ఉచితంగానే కొనసాగుతాయి. ఎండీఆర్ అనేది ప్రభుత్వం లేదా ఎన్‌పీసీఐ వసూలు చేసే పన్ను కాదని, యూపీఐ వ్యవస్థ నిర్వహణ, విస్తరణకు సహకరించేందుకు బ్యాంకులు, పేమెంట్ యాప్ ప్రొవైడర్ల వంటి భాగస్వాములకు పంచే రుసుము అని కూడా వివరించింది.కొత్త నిబంధనల ప్రకారం రూ.2,000 దాటిన పీ2ఎం లావాదేవీలపై 0.4% నామమాత్రపు ఎండీఆర్ వర్తిస్తుంది. రూ.75,000, ఆపైబడిన లావాదేవీలకు ఎండీఆర్ గరిష్ఠంగా రూ.300గా పరిమితం చేశారు. రైల్వే, టెలికాం, ఇంధనం, వ్యవసాయం వంటి అత్యవసర, తక్కువ మార్జిన్లు ఉండే రంగాల్లో రూ.2,000 దాటిన లావాదేవీలకు ఒక్కోదానికి కేవలం రూ.5 ఫ్లాట్ ఛార్జీ వర్తిస్తుందని ఎన్‌పీసీఐ తెలిపింది.

ఈ సారీ 100 శాతం స్ట్రయిక్ రేట్

మొదటిపేజీ తరువాయి



స్థానిక ఎన్నికలపై జనసేన రాష్ట్రస్థాయి సన్నాహక సమావేశం కాకినాడలోని గోదావరి కళాక్షేత్రంలో మంగళవారం జరిగింది. జనసేన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు హాజరయ్యారు. "స్థానిక సంస్థల్లో.. ఏయే స్థానాల్లో పార్టీ బలంగా ఉంది?. ఎక్కడెక్కడ పోటీచేస్తే బాగుంటుందో అధ్యయనానికి నియమించిన కమిటీలతో నేతలు కలిసి ఉండి తగిన నిర్ణయం తీసుకోవాలి. ఎక్కడైనా కూటమి పార్టీలకు చెందిన నేతలతో ఫ్రెండ్లీ పోటీ ఉంటుందని భావించిన చోట పోటీ చేస్తే చేయవచ్చు." అని పేర్కొన్నారు.కష్టపడ్డ కార్యకర్తలకు పోటీ చేసే అవకాశం ఇవ్వాలన్నారు. కొంతమంది నేతలు తాను నియోజకవర్గాలకు వచ్చినప్పుడే హడావుడి చేస్తున్నారని, ఆ తర్వాత పార్టీని అసలు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. "నాతో ఎంతో అనుబంధం ఉన్న జనసైనికులను తెచ్చి నా ముందే షో చేస్తే ఎలా?" అని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత చాలామంది నేతలు కార్యకర్తల కృషిని మర్చిపోయేలా వ్యవహరిస్తున్నారని, ఇది సరికాదని హెచ్చరించారు. ఈ సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు ప్రస్తావనకు వచ్చాయి, నాదెండ్ల మాట్లాడుతూ.. తన వ్యాఖ్యలను జనసేన శ్రేణులు మరో విధంగా అర్థం చేసుకున్నాయని, తన ఉద్దేశం అది కాదన్నారు. పార్టీ బలంగా ఉన్నచోట పోటీ చేయాలనేదే తన ఉద్దేశమని వివరణ ఇచ్చారు.

పిఠాపురంలో రూ.1,500 కోట్ల అభివృద్ధి పండుగ

కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రెండో రోజు విస్తృతంగా పర్యటించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుతో పాటు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు రూ.1,500 కోట్ల అంచనా వ్యయంతో పలు అభివృద్ధి, సంక్షేమ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. పర్యటనలో భాగంగా గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని శ్రీ సీతారామస్వామి వారిని దర్శించుకుని, ఏకాదశి వ్రతాచరణ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాభివృద్ధికి కేటాయించిన రూ.90 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన రథశాల, యాగశాల, కాలక్షేప మండపం, అన్నదాన హాలు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.
అనంతరం యు.కొత్తపల్లి మండలంలో రూ.9.59 కోట్లతో పునరుద్ధరించిన నాగులపల్లి సమగ్ర రక్షిత మంచినీటి పథకాన్ని ప్రారంభించి, 52 ఆవాసాలలోని సుమారు 97 వేల మంది ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందుబాటులోకి తెచ్చారు. కొండేవారంలో ఇంటింటి కుళాయి కనెక్షన్లను స్వయంగా పరిశీలించారు. ఆర్ఆర్ బీహెచ్ఆర్ మైదానంలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో పాల్గొన్న పవన్ కల్యాణ్, స్వయం సహాయక సంఘాలకు రూ.120 కోట్ల రుణాల చెక్కులు, లబ్ధిదారులకు క్రమబద్ధీకరణ ఇళ్ల పట్టాలు, మత్స్యకారులకు లైఫ్ జాకెట్లు, పదో తరగతి ప్రతిభావంతులకు ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు.
పిఠాపురం పట్టణంలో శాశ్వత డంపింగ్ యార్డు సమస్య పరిష్కారం, రూ.225 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం, రూ.34 కోట్లతో దేవాలయాల పునరుద్ధరణ, రూ.323 కోట్లతో ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ వంటి కీలక ప్రాజెక్టులను వేగవంతం చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రైతులు పవన్ కల్యాణ్‌కు నాగలిని కానుకగా ఇచ్చి తమ కృతజ్ఞతలు తెలిపారు.

రౌడీ బ్యాచ్‌ని వదిలిపెట్టం

మొదటిపేజీ తరువాయి



ఆస్ట్రేలియాలో ఉన్నా పట్టుకొచ్చి జైల్లో వేస్తామని హెచ్చరించారు. తనపై కోపం ఉంటే నేరుగా తనతో తేల్చుకోవాలని అన్నారు. డేట్, టైమ్ ఫిక్స్ చేసుకుని మాట్లాడుకుందామని చెప్పారు. డీఎస్సీతో పాటు ఏపీపీఎస్సీ, కల్తీ మద్యంపై కూడా చర్చిద్దామని సవాల్ చేశారు.

చంద్రబాబుపై ఒక్క కేసైనా నిరూపించారా?

తమది నీతి, నిజాయతీలతో బతికిన కుటుంబమని లోకేశ్ అన్నారు. చంద్రబాబుపై తప్పుడు కేసులు పెట్టి 53 రోజులు జైలులో పెట్టారని చెప్పారు. ఆయనపై పెట్టిన ఒక్క కేసు కూడా నిలబడలేదని పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే భయపడలేదని, ఇప్పుడు ఎందుకు భయపడతామని ప్రశ్నించారు. జగన్‌పై విమర్శలు చేస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు.

టీడీపీకి సేవే లక్ష్యం

టీడీపీలో తెలుగు యువత, తెలుగు మహిళ, తెలుగు విద్యార్థి వంటి అనుబంధ విభాగాలు ఉన్నాయని లోకేశ్ తెలిపారు. ప్రజలకు సేవ చేయడమే తమ నాయకత్వ లక్ష్యమని చెప్పారు. పరిటాల శ్రీరామ్ లాంటి యువ నాయకత్వం పార్టీలో ఉందన్నారు. వైసీపీ నాయకత్వానికి, టీడీపీ నాయకత్వానికి తేడాను ప్రజలు గమనించాలని కోరారు. ఎన్టీఆర్, చంద్రబాబు నేర్పిన క్రమశిక్షణతోనే పార్టీ ముందుకు సాగుతోందన్నారు.

పనిచేస్తే పదవులు వస్తాయి

పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వారిని గుర్తిస్తామని లోకేశ్ తెలిపారు. కార్యకర్తలు తాము చేస్తున్న కార్యక్రమాలను మై టీడీపీ యాప్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు. ప్రజల చుట్టూ తిరిగితే పదవులు వెదుక్కుంటూ వస్తాయని అన్నారు. పనిచేయకుండా పదవులు రావాలంటే కుదరదని స్పష్టం చేశారు. పార్టీ ఇచ్చే ప్రతి కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

అనంతపురంలో సేవాభావం

అనంతపురం జిల్లాలో సేవాభావం ఉందని లోకేశ్ అన్నారు. లేపాక్షి, నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయం, ప్రశాంతి నిలయం ఉన్న నేలగా అనంతపురాన్ని ప్రస్తావించారు. ఆర్‌డీటీ దశాబ్దాలుగా ప్రజలకు సేవలు అందిస్తోందన్నారు. సేవ చేయాలనే భావన తమలో ఉందని చెప్పారు. అందుకే ఎన్టీఆర్ అనంతపురం జిల్లాను సొంతం చేసుకున్నారని పేర్కొన్నారు.

పరిటాల కుటుంబంతో అనుబంధం

పరిటాల కుటుంబంతో తమ కుటుంబానికి దశాబ్దాల అనుబంధం ఉందని లోకేశ్ తెలిపారు. అన్యాయం జరిగిన చోట ఎదురొడ్డి నిలబడటం ఇరు కుటుంబాల ధ్యేయమని చెప్పారు. భూస్వాములతో పోరాడి నిరుపేదలకు భూమి పంచారని పరిటాల శ్రీరాములయ్యను గుర్తుచేశారు. పరిటాల రవీంద్ర ఫ్యాక్షన్‌కు ఫుల్‌స్టాప్ పెట్టారని అన్నారు. ఉమ్మడి అనంతపురంలో పలువురు కార్యకర్తలను కోల్పోయామని తెలిపారు.

రాప్తాడులో కార్యకర్తలకు అండగా

2019 నుంచి 2024 వరకు రాప్తాడులో టీడీపీ కేడర్‌ను ఇబ్బంది పెట్టారని లోకేశ్ ఆరోపించారు. తప్పుడు కేసులు బనాయించారని చెప్పారు. తనపై 23 కేసులు పెట్టారని తెలిపారు. పార్టీ కేడర్‌పై పెట్టిన తప్పుడు కేసులను తొలగించే బాధ్యత తనదేనన్నారు. ఇప్పటికే 80 శాతం తప్పుడు కేసులు తొలగించామని చెప్పారు.

వైభవం దిశగా పురపాలికలు

మొదటిపేజీ తరువాయి


రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తున్నాం. పరిపాలనను తిరిగి గాడిలో పెట్టడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నాం. ఇవాళ పట్టణ ప్రాంతాల్లో రూ.11,359 కోట్ల విలువైన పనులకు శ్రీకారం చుట్టాం. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే రూ.22,330 కోట్ల పనులు కొనసాగుతున్నాయి. మరో 6నెలల్లో రూ.17వేల కోట్ల పనులు ప్రారంభిస్తాం. మొత్తం రూ.50 వేల కోట్ల విలువైన పనులు పూర్తయితే రాష్ట్రం దశ-దిశ మారతాయి' అని తెలిపారు. పట్టణాల్లో రోడ్లు, పార్కులు, సెంట్రల్ మీడియన్లు, సీవరేజీ పనులు చేపట్టాలని నిర్ణయించామన్నారు. రిజర్వాయర్ల ద్వారా నీటిని నిల్వ చేసే కార్యక్రమం కూడా చేపట్టినట్లు తెలిపారు. పెద్దఎత్తున అభివృద్ధి పనులను చేపట్టిన మంత్రి పి.నారాయణ, అధికారులను సీఎం అభినందించారు. పట్టణ స్థానిక సంస్థలపై ఆర్థిక భారం పడకుండా హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఏఎం)లో తొలిసారిగా భారీస్థాయిలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. '123 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో రూ.7,469 కోట్లతో పనులు చేపడుతున్నాం. రోడ్ల నిర్మాణానికి 4,656 కోట్లు కేటాయించాం. 2,165 కి.మీ. రోడ్లను అభివృద్ధి చేస్తాం' అని అన్నారు. పట్టణాల అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు, కమిషనర్లు శ్రద్ధ పెట్టాలన్నారు.పట్టణ ప్రాంతాల్లో మెరుగైన నివాస యోగ్యత ఉండాలని చంద్రబాబు అన్నారు. 'పట్టణాలను కాంక్రీట్ జంగిల్స్‌గా కాకుండా ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన ప్రాంతాలుగా తీర్చిదిద్దుతాం. 502 పార్కులు, 210 కిలోమీటర్ల సెంట్రల్ మీడియన్లు, 391 కిలోమీటర్ల స్ట్రీట్ లైటింగ్ పనులు చేపట్టబోతున్నాం. రోడ్లతో పాటు సీవరేజీ వ్యవస్థను కూడా అభివృద్ధి చేస్తాం. వీకెండ్ ఎకానమీ పెంచే దిశగా చర్యలు తీసుకోవాలి. ప్రజలు తమకు వచ్చే ఆదాయంలో 61 శాతం మొత్తాన్ని వారాంతాల్లో ఖర్చు చేస్తున్నారు. హౌసింగ్, రవాణా కోసం పట్టణ ప్రాంతాలవాళ్లు 71 శాతం ఖర్చు చేస్తున్నారు. అందుకే టిడ్కో గృహాలతో పాటు రవాణా కోసం స్త్రీశక్తి లాంటి కార్యక్రమాలు చేపట్టాం. 2027 నాటికి రాష్ట్రంలోని టిడ్కో గృహాలన్నీ పూర్తిచేస్తాం. 2047 నాటికి రాష్ట్రంలోని ప్రతి మున్సిపాలిటీని స్వర్ణ మున్సిపాలిటీగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తున్నాం' అని తెలిపారు. జల్‌జీవన్ మిషన్ పూర్తిచేసి 24గంటలూ సురక్షితమైన తాగునీరు ప్రజలకు అందిస్తామన్నారు. పట్టణాల అభివృద్ధికి పెద్దఎత్తున సంస్కరణలు చేపట్టామని.. భవన నిర్మాణ అనుమతులు త్వరితగతిన ఇస్తున్నామని చెప్పారు. విశాఖ కార్పొరేషన్ పరిధిలో రూ.3890 కోట్ల పనులు చేపడుతున్నట్లు చెప్పారు.
రాష్ట్రంలో వైసీపీ ఐదేళ్ల పాలనలో 120 లక్షల టన్నుల చెత్త పేరుకుపోయిందని సీఎం చెప్పారు. జల్‌జీవన్ మిషన్ వంటి పథకాల నిధులను వినియోగించకుండా దారిమళ్లించారని ధ్వజమెత్తారు. 'గడచిన రెండేళ్లుగా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా 143 లక్షల టన్నుల చెత్త తొలగించాం. ప్రస్తుతం వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు రెండే పనిచేస్తున్నాయి. మరో నాలుగు ప్లాంట్ల నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేస్తాం' అని తెలిపారు. పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు కుప్పంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొనగా.. మంత్రి నారాయణ విశాఖపట్నం నుంచి వర్చువల్‌గా, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కమిషనర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.


ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888

నిఘా నేత్రాలు అలంకార ప్రాయాలు



ఇటీవల రేగుంట గ్రామంలో సి.సి కెమెరాల గురించి అవగాహన కల్పించిన ఎస్సై అనిల్ కుమార్.ద





ప్రభుత్వ పాఠశాలలో ఫర్నిచర్ ధ్వంసం చేసిన ఆకతాయిలు



మల్లన్న స్వామి ఆలయంలో హుండీ పగులగొట్టిన దొంగలు

మల్లాపూర్ సెప్టెంబర్ 22 (రిపబ్లిక్ న్యూస్)

మల్లాపూర్ మండలం రేగుంట గ్రామంలో నిఘా కోసం ఏర్పాటు చేసిన సి.సి కెమెరాలు నామ మాత్రంగా ఉన్నాయి. దొంగతనాలు, రహదారి ప్రమాదాలు, కలప, గంజాయి వంటి అక్రమ రవాణా తదితర నేర సంఘటనలకు సంబంధించిన నిందితులను త్వరగా గుర్తించేందుకు సి.సి కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయి. ప్రస్తుతం గ్రామంలో సి.సి కెమెరాలు ఉన్న వాటి నిర్వహణ సరిగా లేకపోవడంతో కెమెరాలు పని చేయడం లేదు. దీంతో ఎక్కడైనా నేరాలు జరిగితే నిందితులను పట్టుకోవడం పోలీసులకు సవాలుగా మారుతుంది. గ్రామంలో సి.సి కెమెరాలు పని చేయకపోవడంతో ఇటీవల మల్లన్న స్వామి, ఆంజనేయస్వామి ఆలయాలలో దొంగలు హుండీ పగులగొట్టి నగదు, పలు విలువైన వస్తువులను అపహరించుకుపోయారు. ప్రభుత్వ పాఠశాలలో మద్యం, గంజాయి సేవిస్తూ ఆకతాయిలు లక్షల విలువ చేసే పర్నిచర్ ధ్వంసం చేస్తున్నారని పలువురు గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా గ్రామ పాలకవర్గ సభ్యులు స్పందించి పాత కెమెరాలు పని చేసేలా మరమ్మత్తులు చేయించి, మరికొన్ని కొత్త సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని గ్రామం మొత్తం సి.సి కెమెరా పర్యవేక్షణలో ఉండాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సి.సి కెమెరాలు లేక రక్షణ కరవు.

మ్యాకల వెంకటస్వామి, గ్రామస్థుడు బి.సి కాలనీ



బి.సి కాలనీలో కొన్ని నెలల క్రితం దొంగలు పడ్డారు. కాలనీ వాసులు అప్రమత్తమై దొంగలను పట్టుకునే లోపే తప్పించుకొని పారిపోయారు. సి.సి కెమెరాలు ఉంటే దొంగలు దొరికేవారు. ఇప్పటికైన పాలకవర్గ సభ్యులు, వి.డి.సి సభ్యులు స్పందించి సి.సి కెమెరాలు మరమ్మత్తు చేయించాలని బి.సి కాలనీ వాసులు కోరుతున్నారు.

కూచిపూడి నృత్యంలో సహస్ర ప్రతిభ

గుత్తి సెప్టెంబర్ 22(రిపబ్లిక్ న్యూస్)



కూచిపూడి నృత్యంలో విశేష ప్రతిభ కనబరిచిన గుత్తికి చెందిన హెచ్. సహస్రకు దేవస్థానం నిర్వాహకులు ప్రశంసాపత్రం అందజేశారు. గుత్తి శ్రీ కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 20న నిర్వహించిన నృత్య ప్రదర్శనలో సహస్ర తన నృత్యంతో ఆకట్టుకుంది. దీంతో దేవస్థానం వారు ఆమెను ప్రశంసిస్తూ సర్టిఫికెట్ అందజేశారు.
సహస్ర అరవింద్ ఆర్ట్స్ అకాడమీకి చెందిన సురేష్ మాస్టర్ వద్ద కూచిపూడి నృత్యంలో శిక్షణ పొందుతోంది. ప్రస్తుతం కడప జిల్లా గోపాలపురంలోని శ్రీ విద్యాలయం ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో 7వ తరగతి చదువుతోంది. ఈ సందర్భంగా సహస్రను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, బంధుమిత్రులు అభినందించారు.

కరువు సమస్యలు పరిష్కరించాలి

గుత్తి సెప్టెంబర్ 22(రిపబ్లిక్ న్యూస్)



కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గుత్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన సామూహిక దీక్షలు మంగళవారం రెండో రోజుకు చేరాయి. సీపీఐ, సీపీఎం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, అఖిల భారత రైతు కూలీ సంఘాల ఆధ్వర్యంలో ఈ దీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ అనంతపురం జిల్లాను జాతీయ కరువు విపత్తు జిల్లాగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.కరువు ప్రాంత విద్యార్థులకు అన్ని రకాల ఫీజులు రద్దు చేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి మండలంలో పశుగ్రాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని, రైతుల బ్యాంకు రుణాలను రద్దు చేయాలని కోరారు. ఉపాధి హామీ పథకం కింద కూలీలకు రోజుకు రూ.700 చొప్పున కూలి ఇచ్చి పనులు కల్పించాలని, చిన్న, సన్నకారు రైతులకు రూ.10 వేల కరువు పింఛన్ అందించాలని డిమాండ్ చేశారు. పంట నష్టపరిహారాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందించాలని, చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌లకు నీటిని అందించాలని కోరారు.కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రామదాసు, రమేష్‌బాబు, రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటరాముడు, నజీర్, మహమ్మద్, కేవీపీఎస్ మండల కార్యదర్శి మల్లికార్జున, బి.రామకృష్ణ, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి నవీన్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, హుస్సేన్‌పీర, మల్లయ్యయాదవ్, చంద్రగిరి రాధాయాదవ్, వరలక్ష్మి, గురుప్రసాద్ యాదవ్, శ్రీదేవి, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామాంజనేయులు, మండల కార్యదర్శి ధనుంజయ, నజీర్, సురేష్, బెస్త శివకుమార్, టీఎం బాషా, డప్పు కళాకారుడు ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

పన్నులు, అద్దె బకాయిలు చెల్లించాలి

గుత్తి సెప్టెంబర్ 22 (రిపబ్లిక్ న్యూస్)



మున్సిపాలిటీకి చెల్లించాల్సిన ఇంటి పన్ను, నీటి ఛార్జీలు, ఖాళీ స్థలాల పన్ను, మున్సిపల్ షాపు రూముల అద్దె బకాయిలను వెంటనే చెల్లించాలని కమిషనర్ ఎన్.సురేంద్ర పట్టణ ప్రజలు, వ్యాపారులకు సూచించారు. బకాయిలు చెల్లించని వారిపై మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.
షాపు రూముల అద్దె బకాయిలను చెల్లించని వారి లీజును రద్దు చేసి, తిరిగి బహిరంగ వేలం నిర్వహించి ఇతరులకు కేటాయిస్తామని పేర్కొన్నారు. బకాయిలను చట్టప్రకారం వసూలు చేస్తామని తెలిపారు.
అలాగే దినసరి కూరగాయల మార్కెట్‌లో వాహన యజమానుల నుంచి కాకుండా సరుకులు విక్రయించేందుకు తీసుకొచ్చే ట్రేడర్ల నుంచి మాత్రమే సుంకం వసూలు చేయాలని మార్కెట్ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా సుంకం వసూలు చేస్తే లీజు రద్దు చేస్తామని కమిషనర్ హెచ్చరించారు.

గుత్తి అభివృద్ధికి రూ.19 కోట్ల నిధులు

గుత్తి సెప్టెంబర్ 22(రిపబ్లిక్ న్యూస్)



పట్టణంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.19 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు మంగళవారం శ్రీకారం చుట్టారు. గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు, గుత్తి, పామిడి మండలాల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్ ముఖ్య అతిథిగా హాజరై భూమిపూజ, శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ పట్టణంలో తాగునీటి పైప్‌లైన్లు, నిల్వ ట్యాంకుల ఆధునీకరణకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి సీసీ డ్రెయిన్లు, మురుగునీటి పారుదల వ్యవస్థ, అవసరమైన ప్రాంతాల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టనున్నట్లు చెప్పారు.ప్రధాన రహదారులు, అంతర్గత వీధుల్లో బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం, రహదారుల మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. పట్టణ ఆధునీకరణలో భాగంగా ఎల్‌ఈడీ వీధి దీపాలు, ప్రధాన కూడళ్ల అభివృద్ధి పనులు కూడా చేపడతామన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించినట్లు చెప్పారు. గుత్తి పట్టణాన్ని మెరుగైన మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సురేంద్ర, డీఈ హేమచంద్ర, పట్టణ అధ్యక్షుడు ఎం.కె.చౌదరి, చికెన్ సీనా , రమేష్ రాజా సోము, హెచ్.ఎం.రసూల్, సుంకన్న, రామకృష్ణ, పవన్‌కుమార్ యాదవ్, బాషా, కొనకొండ్ల సూరి, కేబి రామకృష్ణ మున్సిపల్ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిడుగుపాటులో ఇద్దరు మృతి..బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి భరోసా

మృతుల కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేత

ఓర్వకల్లు ప్రతినిధి, సెప్టెంబర్22 (రిపబ్లిక్ న్యూస్)





ఓర్వకల్లు మండలం ఉప్పలపాడు గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. టమోటా పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా ఆకస్మికంగా పిడుగుపాటుకు గురై పింజరి బుడ్డ సాహెబ్ (64), పింజరి బీబీ (54) మృతి చెందారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు.
విషయం తెలుసుకున్న నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షురాలు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి, నందికొట్కూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి మృతుల కుటుంబాలను పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, జరిగిన ఘటనపై విచారం వ్యక్తం చేశారు. ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు పార్టీ, ప్రభుత్వం తరఫున అండగా ఉంటామని భరోసా కల్పించారు.మృతుల కుటుంబానికి తక్షణ సహాయంగా రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బాధిత కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాల కోసం తమ వంతు కృషి చేస్తామని వారు తెలిపారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.
ఈ కార్యక్రమంలో ఓర్వకల్లు టీడీపీ మండల అధ్యక్షుడు దుగ్గపూటి నాగిరెడ్డి, స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా మహిళల భద్రత, శక్తి యాప్ బాల్య వివాహాలపై కొనసాగుతున్న అవగాహన

ఆత్మకూరు పట్టణ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు, అవగాహన కల్పించిన శక్తి టీం బృందం





నంద్యాల క్రైం, సెప్టెంబర్ 22, (రిపబ్లిక్ న్యూస్): జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థలలో శక్తి యాప్ మహిళల భద్రత, బాల్య వివాహాలు ,రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు మొదలగు వాటిపై అవగాహన కల్పించాలన్న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం ఆత్మకూరు అర్బన్ సీఐ మహేశ్వర్ రెడ్డి పర్యవేక్షణలో శక్తి టీం బృందం ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవానంద్, ఉపాధ్యాయుల సహకారంతో సుమారు 200 మంది విద్యార్థులకు శక్తి యాప్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, బాలికల రక్షణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన శక్తి యాప్, వాట్సాప్ నంబర్ 7993485111, అత్యవసర సేవలు 112, 100, మహిళా సహాయవాణి 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, సైబర్ నేరాల ఫిర్యాదుల కోసం 1930 నంబర్లపై అవగాహన కల్పించారు. పోక్సో చట్టం, బాల్యవివాహాల నిరోధం, చిన్నారులపై నేరాల నివారణ, వన్‌స్టాప్ సెంటర్ సేవల గురించి వివరించారు. 18 సంవత్సరాల లోపు బాలికలకు వివాహాలు చేయరాదని, బాల్యవివాహాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే 112 లేదా 1098కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా ఫేక్ కాల్స్, అనుమానాస్పద లింకులు, ఏపీకే ఫైల్స్‌ను ఓపెన్ చేయవద్దని, వాటి ద్వారా జరిగే సైబర్ మోసాలు, ఆర్థిక నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వేధింపులకు గురైనప్పుడు భయపడకుండా శక్తి యాప్ లేదా అత్యవసర నంబర్ల ద్వారా పోలీసుల సహాయం పొందాలని సూచించారు. 18 సంవత్సరాల లోపు మైనర్ విద్యార్థులు మోటార్ సైకిళ్లు నడపరాదని, తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. మద్యం సేవించి వాహనం నడిపితే చట్టప్రకారం జరిమానా లేదా జైలు శిక్ష విధించే అవకాశం ఉందని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతూ తల్లిదండ్రులు, గురువులను గౌరవించి, చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని శక్తి టీం సిబ్బంది సూచించారు.

గర్భస్థ పిండ లింగ నిర్ధారణపై అవగాహన

గుత్తి సెప్టెంబర్ 22 (రిపబ్లిక్ న్యూస్)



గర్భస్థ పిండ లింగ నిర్ధారణ ఎంపిక దుర్వినియోగ నివారణ చట్టంపై అవగాహన కల్పించేందుకు విద్యార్థులతో సందేశాత్మక నాటికలను చిత్రీకరించనున్నారు. గుత్తి ఎంఎస్ డిగ్రీ ప్రభుత్వ కళాశాలలో ఈ నెల 22 నుంచి 30వ తేదీలోపు ఐదు నిమిషాల నిడివి గల నాటికను విద్యార్థులతో చిత్రీకరించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి పంపించాలని అధికారులు సూచించారు.సమాజంలో లింగ నిర్ధారణ పరీక్షల దుర్వినియోగంపై అవగాహన పెంపొందించేలా నాటికను మూడు రూపాల్లో చిత్రీకరించాలని తెలిపారు. జిల్లాలోని వివిధ డిగ్రీ కళాశాలల నుంచి వచ్చిన చిత్రీకరణలను పరిశీలించి ఉత్తమ నటన, సందేశాత్మకత ఆధారంగా బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మొదటి బహుమతిగా రూ.30 వేలు, రెండో బహుమతిగా రూ.20 వేలు, మూడో బహుమతిగా రూ.10 వేల నగదు బహుమతులను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందజేయనున్నారు.

పాణ్యం మండలం గోరుకల్లు రిజర్వాయర్ గేట్ల ఘటనపై సమగ్ర దర్యాప్తు చేస్తాం

పాణ్యం ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి



పాణ్యం ప్రతినిధి సెప్టెంబర్, 22 (ప్రజా రిపబ్లిక్ న్యూస్)

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యమా. దుండగుల పనా అనే కోణంలో విచారణ చేసి బాధ్యులు ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక చేశారు

రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు ఆస్తి నష్టం జరిగినా.ప్రాణ నష్టం లేకపోవడం ఉపశమనమన్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి తెలిపారు.గోరుకల్ గ్రామంలో రిజర్వాయర్ ప్రధాన పైప్‌లైన్ తీవ్రంగా దెబ్బతినడంతో గోరుకల్లు గ్రామాన్ని ఒక్కసారిగా భారీ వరద ముంచెత్తింది. రిజర్వాయర్ నుండి ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు గ్రామంలోకి చేరడంతో వీధులన్నీ చెరువులను తలపిస్తున్నాయి. ఇళ్లలోకి వరద నీరు చేరడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

చేపల కోసం చేసిన పని గోరుకల్లు గ్రామాన్ని వణికించింది.

గేట్ల నిర్వహణలో నిర్లక్ష్యం.. - గ్రామంలోకి వరద నీరు.ప్రజల ప్రాణాలతో చెలగాటం వద్దు - కాటసాని.

పాణ్యం ప్రతినిధి సెప్టెంబర్ 22 (ప్రజా రిపబ్లిక్ న్యూస్)

గోరుకల్లు గ్రామంలోకి వరద నీరు చేరడంతో గోరుకల్లు గ్రామస్తులు తీవ్ర ఆందోళనకు గురైన నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి గ్రామానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు.

ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.


ప్రజలకు ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా దేవుడిని ప్రార్థించాల్సిన పరిస్థితి రావడం బాధాకరమన్నారు. వరద నీటి కారణంగా రోడ్లు దెబ్బతినడం, పంటలకు నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడటంతో పాటు గ్రామంలోని మౌలిక వసతులు కూడా దెబ్బతింటున్నాయని తెలిపారు.

చేపల కోసం గేట్లను నిర్వహించిన విధానం వల్లే గ్రామంలోకి నీరు వచ్చే పరిస్థితి ఏర్పడిందని, గేట్లను ఎవరు, ఎందుకు నిర్వహించారనే దానిపై అధికారులు స్పష్టత ఇవ్వాలని కాటసాని డిమాండ్ చేశారు. ప్రజల భద్రత కంటే ఇతర ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వడం సరికాదన్నారు.వరద నీటితో ఎలిమెంటరీ స్కూల్ పరిసరాలు, రోడ్లు, గ్రామంలోని ఇతర ప్రాంతాలు ప్రభావితమవుతున్నాయని, విద్యార్థులు మరియు



గ్రామస్తుల భద్రతపై అధికారులు తక్షణమే దృష్టి పెట్టాలని కోరారు.ఉదయం నుంచే అధికారులు, సంబంధిత శాఖల అధికారులకు ఫోన్ చేస్తున్నా స్పందన లేకపోవడం బాధాకరం అని కాటసాని అన్నారు. ప్రజల సమస్యలు చెప్పేందుకు ఫోన్ చేసినప్పుడు అధికారులు అందుబాటులో ఉండాలని, ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని సూచించారు.జిల్లా కలెక్టర్ గోరుకల్లు గ్రామ పరిస్థితిని ప్రత్యేకంగా పరిశీలించి, అవసరమైన చర్యలు చేపట్టాలని, వరద సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా నిధులు కేటాయించాలని కాటసాని కోరారు.

అధికారులు ఎవరి పట్ల పక్షపాతం లేకుండా ఉద్యోగ



ధర్మాన్ని నిర్వర్తించాలి. ప్రజలకు న్యాయం చేయడం అధికారుల బాధ్యత. గోరుకల్లు ప్రజల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదు అని కాటసాని రామభూపాల్ రెడ్డి స్పష్టం చేశారు

ఆళ్లగడ్డ మున్సిపాలిటీకి 21 కోట్ల నిధులు మంజూరు

ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ





ఆళ్లగడ్డ సెప్టెంబర్ 22 రిపబ్లిక్ న్యూస్

ఆళ్లగడ్డ పట్టణం లోని మున్సిపల్ కార్యాలయం లో జరిగిన హైబ్రిడ్ యాన్యూటీ మోడల్ పథకాన్ని సి ఎమ్ చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో ప్రారంభించారు.ఈ కార్యక్రమం లో ఆళ్లగడ్డ టీ డి పి నాయకులు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ మాట్లాడుతూ పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి మన కూటమి ప్రభుత్వం వేసిన అతిపెద్ద అడుగులో భాగంగా, గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఈరోజు కుప్పం నుండి 'హైబ్రిడ్ యాన్యుటీ మోడల్' పథకాన్ని వర్చువల్ విధానంలో ప్రారంభించారు.



అహోబిలం మఠం ఏ ఓ గా బాధ్యతలు స్వీకరించిన రంగరాజు



ఆళ్లగడ్డ సెప్టెంబర్ 22 రిపబ్లిక్ న్యూస్

ఆళ్లగడ్డ తాలూకా అహోబిలం గ్రామం లో వెలసిన అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా రంగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు అహోబిల మఠం 46వ పీఠాధిపతి శ్రీ వన్ శఠగోప శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన దేవస్థానం ఏవోగా ఈ రోజు పదవీ బాధ్యతలు స్వీకరించారు.

వి అర్ ఏ ల డిమాండ్ల సాధనకు కృషిచేస్తాం

ఆళ్లగడ్డ సెప్టెంబర్ 22 రిపబ్లిక్ న్యూస్



ఆళ్లగడ్డ తాలూకా శిరువెళ్ల మండలం శిరివెళ్ల గ్రామ రెవెన్యూ సహాయకుల డిమాండ్ల సాధనకు అలుపెరగని పోరాటం తప్పదని అందుకు నిరంతరం కృషి చేస్తామని మండల యూనియన్ నాయకులు పేర్కొన్నారు.తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటాలు, నిరసనలు మరియు సమ్మెలు నిర్వహిస్తున్న నేపథ్యంలో శిరివెళ్ల మండల కేంద్రంలో సైతం పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపట్టారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించి ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు.ఈ కార్యక్రమంలో సిరివెళ్ల మండల అధ్యక్షులు తమ న్యాయమైన తమ డిమాండ్ల సాధన కోసం ఆందోళన నిర్వహించి నినాదాలు చేశారు.వి ఆర్ ఏ లు ధర్నాలు, ఆమరణ నిరాహార దీక్షలు చేపట్టిన కారణంగా ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏల మండల అధ్యక్షులు పాములేటి,ఉపాధ్యక్షులు మాలి, కార్యదర్శి ముని, ట్రెజరీ మస్తాన్,కోనేటి తిరుపాల్, చెన్నూరు తిరుపాలు, సాహెల్ తదితర వీఆర్ఏ లతోపాటు సుమారు 30 మందికి పైగా ధర్నాలతో తాసిల్దార్ కార్యాలయం దద్దరిలేలా ఆందోళన చేపట్టారు.

దళితుడిపై భూమా కిషోర్ రెడ్డి అనుచరుల దాడి

అవమానంతో పురుగుల మందు తాగిన దళిత యువకుడు సంజీవ

ఆళ్లగడ్డ సెప్టెంబర్ 22 రిపబ్లిక్ న్యూస్

ఆళ్లగడ్డ తాలూకా రుద్రవరం మండలం చందలూరు గ్రామానికి చెందిన దళిత యువకుడు సంజీవ ను వైసీపీ రాష్ట్ర కార్యదర్శి భూమా కిషోర్ రెడ్డి అనుచరులు అంబటి మహేశ్వర్ రెడ్డి, సుద్దమళ్ళ శేకర్ రెడ్డి, చాకలి శ్రీను, రసూల్, రవి మరి కొందరు కలిసి దాడిచేశారని.తనను కులం పేరుతో దూశించారని. తాను తన అమ్మ నాన్న చాలా సంవత్సరాలనుండి భూమా కిషోర్ రెడ్డి దగ్గర పని చేస్తున్నామని.తాను సైట్ వర్కర్ గా పని చేస్తున్నానని. కోళ్ల షెడ్డు వేసిన డబ్బులు లక్ష పది వేలు తమ కుటుంబానికి కిషోర్ రెడ్డి ఇవ్వాలని తన జీతం డబ్బులు దాదాపు 8 నెలలుగా



ఇవ్వలేదని అది 30 వేలు తనకు రావాలని మొత్తం లక్ష యాభై వేల రూపాయలు రావాలని ఆ డబ్బులు ఇవ్వాల్సి వస్తుందని తన మీద దాడి చేసి కొట్టారని. కంపెనీ కి



తెలియకుండా కోళ్లు దొంగతనం చేసి అమ్మమని అంబటి మహేశ్వర్ రెడ్డి చెప్పాడని ఇపుడు దొంగతనం నేరం నా మీద మోపి నా మీద దాడి చేశారని చెడ్డ చెడ్డ భూతులు తిడుతూ కులం పేరుతో దుషిస్తూ తనను కొట్టారని ఈ అవమానం భరించలేక తాను పురుగుల మందు తాగి చనిపోతున్నానని. మా అమ్మ నాన్నకు ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ అక్క భార్గవ్ రామ్ దంపతులు సాయం చేయాలని వాళ్లను ఆదుకోవాలని. వారికీ న్యాయం జరిగేలా చూడాలని సెల్ఫీ వీడియోలో కోరుతూ పురుగుల మందు తాగిన సంజీవ.గమనించిన బంధువులు ఆళ్లగడ్డ లోని డాక్టర్ రామకృష్ణ రెడ్డి ఆసుపత్రికి తరలించారు. వీడియో చూసి స్పందించిన ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ డాక్టర్ లతో మాట్లాడి మెరుగైన చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వారం రోజులైనా వెనక్కి తగ్గని వీఆర్ఏలు

డిమాండ్ల సాధనలో రాజీలేని పోరాటం -విధులు బహిష్కరించి కొనసాగిస్తున్న సమ్మె



బండి ఆత్మకూరు, సెప్టెంబర్ 22,(రిపబ్లిక్ న్యూస్):– డిమాండ్ల సాధనలో వీఆర్ఏలు రాజీలేని పోరాటం చేస్తున్నారు. వారం రోజులైనా వెనక్కి తగ్గకుండా విధులు బహిష్కరించి సమ్మె కొనసాగిస్తున్నారు. బండి ఆత్మకూరు మండలంలోని రెవెన్యూ సహాయకులు చేపట్టిన నిరవధిక సమ్మె ఏడవ రోజుకు చేరుకుంది. మంగళవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎదుట వీఆర్ఏలు సమ్మెలో కూర్చొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎన్నికల సమయంలో గుర్తుకు వచ్చిన రెవెన్యూ సహాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. వేతన పెంపు లేదు.. పదోన్నతులు లేవు.. తాము నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం లేదు.. మరి తమ బతుకులు ఎలా సాగించాలంటూ వారు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. ఒట్టి హామీలతో మా కడుపులు నిండవని, మా కుటుంబాలు బ్రతకాలంటే న్యాయమైన వేతనం, అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని వీఆర్ఏల ప్రతినిధులు పెద్దన్న, నారాయణ, శేషులు డిమాండ్ చేశారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లోనే తాము నిరవధిక సమ్మెకు దిగాల్సి వచ్చిందని వీఆర్ఏల జేఏసీ నాయకులు తెలిపారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. లేదంటే నిరవధిక సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు నగరంలో వైభవంగా గణేష్ నిమజ్జన శోభాయాత్ర

శ్రీరామనగర్‌లో భక్తిశ్రద్ధలతో గణనాథుడికి వీడ్కోలు..

రూ.1.40 లక్షలకు లడ్డూను సొంతం చేసుకున్న ముగ్గురు మిత్రులు

కర్నూలు ప్రతినిధి, సెప్టెంబర్ 22 (రిపబ్లిక్ న్యూస్):

కర్నూలు నగరంలోని శ్రీరామనగర్‌లో గణేష్ నిమజ్జన శోభాయాత్రను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. శ్రీ శ్రీ శ్రీ వరసిద్ధి వినాయక భక్త బృందం, ఎస్.ఆర్. యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నిమజ్జన శోభాయాత్ర ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కర్నూలులో ప్రఖ్యాతి గాంచిన సప్తగిరి పెయింట్స్ అధినేత శ్రీకాంత్‌తో పాటు ఆయన ఇద్దరు సన్నిహిత మిత్రులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన లడ్డూ వేలం పాటలో రూ. 1.40



లక్షలకు వినాయక లడ్డూను శ్రీకాంత్‌తో పాటు ఆయన ఇద్దరు మిత్రులు కలిసి సొంతం చేసుకున్నారు.

ముగ్గురు మిత్రులు కలిసి గణనాథుడి లడ్డూను దక్కించుకోవడం వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తి, స్నేహం, ఆత్మీయతకు ప్రతీకగా లడ్డూ వేలంలో పాల్గొని గణనాథుడి ఆశీస్సులు పొందారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో,



ఆయురారోగ్యాలతో, కుటుంబ శ్రేయస్సుతో ఉండాలని ఆకాంక్షించారు. వినాయక నిమజ్జన వేడుకలు భక్తి, ఐక్యత, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు.నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా శ్రీరామనగర్ వీధుల్లో భక్తుల సందడి నెలకొంది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో భక్త బృందం సభ్యులు, ఎస్.ఆర్. యూత్ సభ్యులు, స్థానిక పెద్దలు, యువత, వీధి ప్రజలు పాల్గొన్నారు.

ఇళ్ళ ముందు చల్లే కల్లాపి పౌడర్ అమ్మ రాదు - ఎస్పై జగన్మోహన్

బండి ఆత్మకూరు, సెప్టెంబర్ 22,(రిపబ్లిక్ న్యూస్):-



ఇళ్ళ ముందు పేడ నీళ్ళకు ప్రత్యామ్నాయంగా చల్లే కల్లాపి పౌడర్ కిరాణం కొట్టులో విక్రయించరాదని ఎస్పై జగన్మోహన్ సూచించారు. ఇందులో భాగంగా ఆయన మంగళవారం బండి ఆత్మకూరు మండలంలోని కిరాణం కొట్టుదారులకు అవగాహన కల్పించారు. ఇంటి ముందు చల్లే సౌభాగ్య కల్లాపి పౌడర్ లో ప్రజలకు హాని కలిగించే విషపూరిత రసాయనాలు కలిగి ఉన్నాయని వీటివల్ల ప్రజలు క్యాన్సర్ వంటి తీవ్రమైన అనారోగ్య సమస్యల బారిన పడే అవకాశం ఎక్కువగా ఉందని ల్యాబ్ పరీక్షల్లో తేలిందన్నారు. దీంతో వీటి అమ్మకాలు ప్రభుత్వం పూర్తిగా నిషేధించడం జరిగిందన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకొని నిషేధిత వస్తువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పై హెచ్చరించారు. ఇలాంటి వాటి అమ్మకాల విషయంలో కిరాణం కొట్టుదారులు జాగ్రత్త వహించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కిరాణం కొట్టుదారులు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అవగాహన



ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 22 (ప్రజా రిపబ్లిక్ న్యూస్): 9వ జాతీయ పోషణ మాసం సందర్భంగా ఎమ్మిగనూరు ఐసీడీఎస్ సీడీపీఓ సఫర్నిసా బేగం, సూపర్‌వైజర్ గుణశేఖరమ్మ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మీదేవి, జయంతి, లలిత మాట్లాడుతూ పోషక విలువలు కలిగిన సమతుల ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వివరించారు. చిన్నారులకు సమతుల ఆహారం అందించడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, రక్తహీనత నివారణకు పోషకాహారం తీసుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.అనంతరం అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారులు, తల్లులతో పోషణపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సహాయకులు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు మృతి చెందిన మహిళల కుటుంబాలను పరామర్శించిన పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని

బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలి



ఓర్వకల్ ప్రతినిధి, సెప్టెంబర్ 2 2(రిపబ్లిక్ న్యూస్) ఓర్వకల్లు మండలం: ఉప్పలపాడు గ్రామంలో పిడుగుపాటుకు గురై మృతి చెందిన మహిళల కుటుంబాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.పిడుగుపాటు ఘటనలో అమాయక మహిళలు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదకరమని కాటసాని రామభూపాల్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాల పరిస్థితిని అడిగి తెలుసుకుని, వారి బాధలో తాను భాగస్వామినని తెలిపారు. ఈ దుర్ఘటనతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే స్పందించి, బాధిత కుటుంబాలకు అవసరమైన ఆర్థిక సహాయంతో పాటు అన్ని విధాలా అండగా నిలవాలని ఆయన డిమాండ్ చేశారు.

రామదుర్గం, ఏరూరు, గ్రామాలలో పాలం పిలుస్తుంది







చిప్పగిరి, సెప్టెంబర్, 22,(రిపబ్లిక్ న్యూస్)చిప్పగిరి మండలం రామదుర్గం మరియు ఎరూర్ గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం వ్యవసాయ అధికారి శ్రీరామ్ ప్రవీణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు,ఈ కార్యక్రమంలో ఏడీఏ శ్రీ చంగల్రాయుడు , ఆర్ఎస్కే ఇన్‌చార్జీలు మరియు ఏ ఈ ఓ శ్రీమతి రమాదేవి పాల్గొన్నారు, అధికారులు మాట్లాడుతూ రైతు సోదరులకు పలు ముఖ్యమైన విషయాలపై అవగాహన కల్పించడం జరిగింది, పంట వేసుకున్న ప్రతి రైతు తప్పనిసరిగా తమ పంటను నమోదు చేసుకోవాలని,
పంట నమోదు అనంతరం రైతులు తప్పనిసరిగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని పీఎం కిసాన్ పథకం ద్వారా లబ్ధి పొందేందుకు అవసరమైన ఈ-కేవైసీని సంబంధిత ఆర్ఎస్కే ఇన్‌చార్జి వద్ద పూర్తి చేసుకోవాలని,ప్రస్తుత పంటలలో కొన్ని ప్రాంతాల్లో పెరుగుదల ఆశించిన స్థాయిలో లేకపోవడం మరియు వర్షపాతం పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, రాబోయే రబీ సీజన్‌కు తగినంత పోస్ట్ మాన్సూన్ డ్రై సోయింగ్ ఏర్పాట్లు ముందుగానే చేసుకోవాలని,రైతులు వ్యవసాయ శాఖ సూచనలను పాటిస్తూ, పంట నమోదు మరియు ఈ-కేవైసీ ప్రక్రియలను సకాలంలో పూర్తి చేసుకోవాలని కోరడమైనది ఈ కార్యక్రమంలో గ్రామాల రైతులు పాల్గొన్నారు.

తొమ్మిది రోజుల భక్తిశ్రద్ధల పూజల అనంతరం వినాయక లడ్డూ వేలం

రూ.36 వేలతో లడ్డూను దక్కించుకున్న పద్మ టైలర్స్ యజమాని శీను కుటుంబం






కర్నూలు ప్రతినిధి, సెప్టెంబర్ 22 (రిపబ్లిక్ న్యూస్): కర్నూలు నగరంలోని బి. క్యాంప్‌లో శ్రీ శ్రీ శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం పార్కులో వినాయక చవితి ఉత్సవాలు తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హారతులు నిర్వహిస్తూ గణనాథుడికి భక్తులు విశేష పూజలు చేశారు.తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు అందుకున్న స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని ఉత్సవాల ముగింపు సందర్భంగా వేలం నిర్వహించారు. భక్తుల సమక్షంలో జరిగిన ఈ వేలంలో పద్మ టైలర్స్ యజమాని శీను రూ.36,000లకు లడ్డూను దక్కించుకున్నారు.తొమ్మిది రోజుల పాటు ఎంతో భక్తితో పూజలు అందుకున్న స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకోవడం తనకు ఎంతో సంతోషంగా, అదృష్టంగా ఉందని శీను తెలిపారు. స్వామివారి ఆశీస్సులు తమ కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. లడ్డూ వేలం సందర్భంగా భక్తుల్లో ఉత్సాహం నెలకొంది. వేలంలో లడ్డూను దక్కించుకున్న శీనును ఉత్సవ నిర్వాహకులు, భక్తులు అభినందించారు.భక్తిశ్రద్ధలతో పూజలు అందుకున్న స్వామివారి ప్రసాదాన్ని దక్కించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని కుటుంబ సభ్యులు పలువురు భక్తులు పేర్కొన్నారు.

డిగ్రీ రెండో సెమిస్టర్ ఫలితాల్లో రావూస్ విద్యార్థులు విజయభేరి

పలు కోర్సుల్లో టాప్ టాపర్లుగా విద్యార్థుల ప్రతిభ -కళాశాల సీఈఓ తిరుమలరెడ్డి వెల్లడి



ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 22(ప్రజారిపబ్లిక్ న్యూస్) రాయలసీమ యూనివర్సిటీ ఇటీవల విడుదల చేసిన డిగ్రీ రెండో సెమిస్టర్ హానర్స్ కోర్సు రెగ్యులర్ ఫలితాల్లో ఎమ్మిగనూరు పట్టణంలోని రావూస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. పలు కోర్సుల్లో అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించి టాప్ టాపర్లుగా నిలిచి కళాశాలకు గుర్తింపు తీసుకొచ్చారు వారిని మంగళవారం కళాశాల సీఈవో తిరుమల రెడ్డి బృందం అభినందించారు. బీఎస్సీ జువాలజీ హానర్స్‌లో ఏ. పుష్పావతి 8.83, బి. గాయత్రి 8.59, డి. విశాల 8.46; బీఎస్సీ కంప్యూటర్ హానర్స్‌లో బి. మహాదేవి 8.38, ఎం. వైష్ణవి లత 7.94; బీఎస్సీ బోటనీ హానర్స్‌లో జి. శశికల 7.89, సి. లోహిత 7.83, ఎస్‌కే. మహీరామర్యం 7.78 గ్రేడ్ పాయింట్లు సాధించారు. బీబీఏ హానర్స్‌లో దీప్తి 7.37, యూ. ఇందు 7.06, ధరణి 6.97; బీఏ పొలిటికల్ సైన్స్ హానర్స్‌లో కబి. అస్మా 8.02, ఎం. సాయి వైష్ణవి 7.23, బి. తేజస్విని 6.83; బీఏ హిస్టరీ హానర్స్‌లో షేక్ ముస్కాన్ 6.89, కే. అయిషా 6.87 గ్రేడ్ పాయింట్లు సాధించారు. బీకామ్ హానర్స్‌లో తాసిన్ కాతున్ 7.93, గౌసియా మంథషా 7.86, బి. మహాలక్ష్మి 7.85; బీసీఏ హానర్స్‌లో జి. సాయికీర్తన 8.64, కే. ఇందు 8.25, కే. అశ్విని 8.01; బీఎస్సీ మ్యాథ్స్ హానర్స్‌లో ఈ. చందు 7.64, బి. అంజలి 7.38, కే. సాబీరబీ 7.17; బీఏ స్పెషల్ ఉర్దూ హానర్స్‌లో అస్మాభాను 8.51, అఫ్రీన్ భాను 8.12 గ్రేడ్ పాయింట్లు సాధించి సత్తా చాటారు. ఈ సందర్భంగా కళాశాల సీఈఓ తిరుమలరెడ్డి, సీఓఓ సుజనా రెడ్డి మాట్లాడుతూ పరీక్షలు ఏవైనా ఉత్తమ ఫలితాలు సాధించడం రావూస్ కళాశాల ప్రత్యేకత అని తెలిపారు. విద్యార్థుల కృషికి అధ్యాపకుల మార్గదర్శకత్వం తోడై ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. విజయాలు సాధించిన విద్యార్థులను అకాడమిక్ ఇన్‌చార్జ్ వీరేష్, ప్రిన్సిపాల్ జీఎండీ ఇర్ఫాన్‌తో పాటు అధ్యాపకులు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఎమ్మిగనూరు అభివృద్ధికి రూ.31 కోట్ల పనులకు శ్రీకారం

రోడ్లు, డ్రైనేజీలు, వీధిదీపాలు, తాగునీటి వసతుల మెరుగుదలకు ప్రాధాన్యం

పట్టణాన్ని ఆధునిక వసతులతో అభివృద్ధి చేస్తాం

ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయ నాగేశ్వర్‌రెడ్డి





ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 22 (ప్రజా రిపబ్లిక్ న్యూస్): ఎమ్మిగనూరు పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి రూ.31 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయ నాగేశ్వర్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ పట్టణాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం చేపట్టిన హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఏఎం) ప్రాజెక్టుల వర్చువల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా ఈ పనులకు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.
ముందుగా టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే ఎస్‌బీఐ సర్కిల్ నుంచి కుర్నీ కళ్యాణ మండపం వరకు ర్యాలీగా చేరుకున్నారు. అనంతరం సభా వేదిక వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.11,360 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా ప్రారంభించగా, అందులో భాగంగా ఎమ్మిగనూరు మున్సిపాలిటీకి రూ.31 కోట్ల విలువైన పనులు మంజూరయ్యాయి.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎమ్మిగనూరు పట్టణంలో రోడ్ల అభివృద్ధి, మురుగునీటి కాలువల నిర్మాణం, వీధిదీపాల ఏర్పాటు, పార్కుల అభివృద్ధి, తాగునీటి పైపులైన్ల మెరుగుదల తదితర మౌలిక వసతుల పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి వేగంగా పూర్తి చేస్తామని తెలిపారు.
ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు ఎమ్మిగనూరు పట్టణాన్ని ఆధునిక వసతులతో అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.
కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు, కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు, వార్డు కమిటీ నాయకులు, మహిళలు, ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాగ్ బృందం అంగన్వాడి కేంద్రాల తనిఖీ

ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ పనితీరుపై ఆరా



బండి ఆత్మకూరు, సెప్టెంబర్ 22,(రిపబ్లిక్ న్యూస్):- బండి ఆత్మకూరు మండలంలోనీ పలు అంగన్వాడీ కేంద్రాల్లో భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) బృందం తనిఖీలు చేపట్టింది. కాగ్ బృందం సీనియర్ ఏఓ జి.వై.విజయ్ ఆధ్వర్యంలో ఏఏఓ ప్రదీప్, గౌరవ్ లు మంగళవారం బండి ఆత్మకూరు మండలంలోనీ లింగాపురం, నారాయణాపురం, ఈర్నపాడు, బి.కోడూరు, సింగవరం గ్రామాల్లోఉన్న అంగన్వాడీ కేంద్రాలను సందర్శించారు. కాగాఎఫ్ఎల్ ఎన్ పనితీరు ఆడిట్ లో భాగంగా మండలంలోని ఎంపిక చేసిన ఆరు పాఠశాలలు, వాటికి అనుసంధానమైన అంగన్‌వాడీ కేంద్రాలను కాగ్ బృందం తనిఖీ చేసి అందులోని రికార్డులు పరిశీలించారు. ఆయా అంగన్వాడి కేంద్రాల్లో విద్యార్థుల హాజరు శాతం, విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు, గర్భిణులు, బాలింతలు, మరియు చిన్నారులకు పంపిణీ చేసే బాలామృతం, పాలు, బియ్యం, పప్పులు, నూనె వంటి నిత్యావసరాల సప్లై పై చైన్ మేనేజ్‌మెంట్ పోర్టల్ రికార్డులతో పూర్తిగా సరిపోతున్నాయ ? లేదా అని పరిశీలించినట్లు ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి తెలిపారు. పాఠశాలలకు అనుసంధానమైన అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందుతున్న సేవల పై ఆరా తీశారు. పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. ఎఫ్ఎల్ ఎన్ పనితీరును మెరుగుపరిచేందుకు కాగ్ బృందం సిబ్బందికి అవసరమైన సూచనలు, సలహాలను తెలియజేశారు. అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులతో పాటు గర్భిణీ లు ,బాలింతలకు అందుతున్న సేవలు మరింత పటిష్టం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రత్యేక యాప్ పనితీరు అడిగి తెలుసుకున్నారు. అలాగే అంగన్వాడి కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాల వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో కాగ్ బృందం పాల్గొన్నారు.

వడ్డెర్లకు టీడీపీ భరోసా

మాట ఇచ్చాం.. నిలబెట్టుకున్నాం.. -రమాదేవికి ఎమ్మెల్సీ పదవితో గౌరవం : ఎమ్మెల్యే దగ్గుపాటి





అనంతపురం సంక్షేమం, సెప్టెంబర్ 22, (రిపబ్లిక్ న్యూస్):
వడ్డెర్ల ఆత్మీయ సమావేశం వేదికగా టీడీపీ తమ సామాజిక వర్గానికి ఇచ్చిన హామీలు, ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వివరించారు. అనంతపురం నగర శివారులోని ఎంవైఆర్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఇటీవల ఎమ్మెల్సీగా నియమితులైన రమాదేవిని ఘనంగా సత్కరించారు.“ నా గెలుపులో మీ భాగస్వామ్యం ఉంది “అంటూ వడ్డెర సోదరులను ఉద్దేశించి దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడారు.

క్వారీ రంగంలో వడ్డెర్లకు 33 శాతం ప్రత్యేక కేటాయింపు

అనంతపురానికి కొత్తగా వచ్చిన తనను ఆదరించి అండగా నిలిచిన వారిలో వడ్డెర్లు కూడా ఉన్నారని గుర్తుచేశారు. రాష్ట్ర నిర్మాణంలో వడ్డెర్ల చెమట చిందని రంగం లేదని పేర్కొన్నారు. రోడ్లు, భవనాలు, చెరువులు, కాలువలు, రాతి పనులు, నిర్మాణ రంగాల్లో వారి శ్రమ కీలకమన్నారు.సంప్రదాయ వృత్తిని ఆధునిక ఉపాధి అవకాశాలతో అనుసంధానం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. క్వారీ రంగంలో వడ్డెర్లకు 33 శాతం ప్రత్యేక కేటాయింపు ద్వారా ఆర్థికంగా ఎదిగే అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఆదరణ3 ద్వారా ఆధునిక పనిముట్లు, యంత్రాలు అందించడంతో పాటు బీసీ యువతను స్వయం ఉపాధి, ఎంఎస్ఎంఈ రంగాల వైపు ప్రోత్సహించే చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.
“వడ్డెర ఆడబిడ్డకు ఎమ్మెల్సీ పదవి “ అంటూ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని దగ్గుపాటి అన్నారు.

బీసీల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం

రమాదేవికి ఎమ్మెల్సీ పదవి ఇవ్వడం ద్వారా వడ్డెర సమాజానికి రాజకీయ ప్రాతినిధ్యం కల్పించామని పేర్కొన్నారు. వడ్డెర యువత ఉన్నత విద్యను అభ్యసించి ఇంజినీర్లు, వైద్యులు, ప్రభుత్వ అధికారులు, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు.
బీసీలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక అవకాశాలు పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించే నిర్ణయం బీసీల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ నాయకత్వంలో బీసీల సంక్షేమానికి టీడీపీ కట్టుబడి ఉందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No.:/2023/87888

ఘనంగా ఎన్టీఆర్, పరిటాల రవీంద్ర విగ్రహాల ఆవిష్కరణ

భారీ బైక్ ర్యాలీ.. లోకేశ్‌కు ఘన స్వాగతం



రాప్తాడు సంక్షేమం, సెప్టెంబర్ 22 (రిపబ్లిక్ న్యూస్):
రాప్తాడు మండల కేంద్రం మంగళవారం పసుపుమయంగా మారింది. స్వర్గీయ నందమూరి తారకరామారావు, పరిటాల రవీంద్ర విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ హాజరయ్యారు. కార్యక్రమానికి టీడీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చారు.రాప్తాడు కూడలికి చేరుకున్న మంత్రి లోకేశ్‌కు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. భారీ గజమాలతో సత్కరించారు. బాణసంచా కాల్చుతూ, డప్పులు వాయిస్తూ కార్యకర్తలు సందడి చేశారు. పార్టీ జెండాలు పట్టుకొని “ జై తెలుగుదేశం “ అంటూ నినాదాలు చేశారు.



దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటాం

అనంతరం రాప్తాడు సర్కిల్ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. మంత్రి లోకేశ్ పరిటాల శ్రీరామ్‌తో కలిసి వాహనంపై నిలబడి ప్రజలకు, పార్టీ శ్రేణులకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. అనంతరం భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.తర్వాత రాప్తాడు సర్కిల్‌లో ఏర్పాటు చేసిన స్వర్గీయ ఎన్టీఆర్, పరిటాల రవీంద్ర విగ్రహాలను మంత్రి నారా లోకేశ్ ఆవిష్కరించారు. విగ్రహాల ఆవిష్కరణ అనంతరం నిర్వహించిన రాప్తాడు నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమన్వయ సమావేశంలో మంత్రి లోకేశ్ ప్రసంగించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనపై విమర్శలు చేశారు.



ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించకుండా నిరుద్యోగులను మోసం చేశారని ఆరోపించారు. ఉపాధ్యాయులపై ఇటీవల జరిగిన దాడి ఘటనను ప్రస్తావిస్తూ, దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు.రాప్తాడు నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో టీడీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి వేధించారని లోకేశ్ ఆరోపించారు. కార్యకర్తలపై నమోదైన తప్పుడు కేసులను తొలగించే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో సత్యసాయి జిల్లా ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, టీడీపీ అధ్యక్షుడు ఎంఎస్ రాజు, మంత్రి సవిత, టీడీపీ జోనల్ ఇన్‌చార్జ్ శ్రీనివాసరెడ్డి, దగ్గుపాటి వెంకటప్రసాద్, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, అనంతపురం జిల్లా టీడీపీ అధ్యక్షుడు పూల నాగరాజు తదితర ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





రాప్తాడు గడ్డపై.. పసుపు ప్రభంజనం

లోకేశ్ రాకతో పసుపుమయమైన రాప్తాడు
ఎన్టీఆర్, పరిటాల రవి విగ్రహావిష్కరణకు
భారీగా తరలివచ్చిన టీడీపీ శ్రేణులు





రాప్తాడు సంక్షేమం, సెప్టెంబర్ 22, (రిపబ్లిక్ న్యూస్):
రాప్తాడు గడ్డ ఒక్కసారిగా పసుపు సంద్రాన్ని తలపించింది. ఎటుచూసినా పసుపు కండువాలు.. చేతుల్లో టీడీపీ జెండాలు.. నినాదాలతో హోరెత్తిన వాతావరణం.. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాకతో నియోజకవర్గ కేంద్రంలో రాజకీయ సందడి నెలకొంది. ఎన్టీఆర్, పరిటాల రవీంద్ర విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరైన లోకేశ్‌కు ఘన స్వాగతం పలికేందుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.మంత్రి పర్యటన నేపథ్యంలో రాప్తాడు ప్రధాన రహదారులు, కూడళ్లు పసుపు జెండాలతో నిండిపోయాయి. గ్రామాల నుంచి తరలివచ్చిన కార్యకర్తలతో రాప్తాడు కిక్కిరిసిపోయింది. లోకేశ్ కాన్వాయ్ రాక కోసం అభిమానులు, పార్టీ శ్రేణులు ఆసక్తిగా ఎదురుచూశారు. ఎన్టీఆర్, పరిటాల రవీంద్ర విగ్రహాల ఆవిష్కరణను పురస్కరించుకుని టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలెత్తింది. పార్టీ నేతలు, కార్యకర్తలు భారీగా సమీకరించడంతో రాప్తాడులో పసుపు పండుగ వాతావరణం కనిపించింది.



లోకేశ్ పర్యటనకు భారీ స్పందన లభించడంతో పార్టీ శ్రేణుల్లో జోష్ నెలకొంది. ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి పరిటాల శ్రీరామ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.



లోకేశ్‌కు ఘన స్వాగతం

మర్యాదపూర్వకంగా కలిసిన డా. జె.ఎల్. మురళీధర్
శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేత



శ్రీ సత్యసాయి ప్రతినిధి, సెప్టెంబర్ 22, (రిపబ్లిక్ న్యూస్):
రాప్తాడు నియోజకవర్గ పర్యటనకు వచ్చిన రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు పుట్టపర్తి విమానాశ్రయంలో టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. విమానాశ్రయానికి చేరుకున్న లోకేశ్‌ను అర్బన్ బ్యాంక్ చైర్మన్, టీడీపీ రాష్ట్ర నాయకుడు డా. జె.ఎల్. మురళీధర్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా లోకేశ్‌కు శాలువా కప్పి సత్కరించిన మురళీధర్.. పుష్పగుచ్ఛం అందజేసి సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం కొద్దిసేపు ఇరువురి మధ్య ఆత్మీయంగా సంభాషణ సాగింది. శ్రీ సత్యసాయి జిల్లాలో రాజకీయ పరిస్థితులు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల అమలుపై చర్చించినట్లు తెలిపారు.రాప్తాడు నియోజకవర్గంలో మంత్రి లోకేశ్ పర్యటనకు సంబంధించి జరుగుతున్న కార్యక్రమాలు, పార్టీ శ్రేణుల సమీకరణ, పర్యటనకు ప్రజల నుంచి వస్తున్న స్పందన తదితర అంశాలు కూడా చర్చకు వచ్చినట్లు సమాచారం. జిల్లాలో అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరంపై కూడా ఇరువురూ మాట్లాడుకున్నట్లు తెలిసింది.రాప్తాడు నియోజకవర్గ పర్యటనలో మంత్రి లోకేశ్ పాల్గొనే కార్యక్రమాలు విజయవంతం కావాలని డా. జె.ఎల్. మురళీధర్ ఆకాంక్షించారు. లోకేశ్ పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్న సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహ వాతావరణం కనిపించింది.

ధీరజ్ ఎన్‌క్లేవ్‌లో ఘనంగా వినాయక నిమజ్జన వేడుకలు

తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో పూజలు.. చిన్నారుల నృత్యాలతో సందడిగా నిమజ్జనోత్సవం



కర్నూలు ప్రతినిధి, సెప్టెంబర్ 22 (రిపబ్లిక్ న్యూస్):కర్నూలు నగరంలోని ధీరజ్ ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్‌లో వినాయక చవితి వేడుకలు తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అపార్ట్‌మెంట్‌లోని వేర్వేరు పోర్షన్లలో నివసిస్తున్న కుటుంబాలు ఒక కుటుంబంలా కలిసిమెలిసి గణనాథునికి ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించారు.తొమ్మిదో రోజు వినాయక నిమజ్జనాన్ని పురస్కరించుకొని అపార్ట్‌మెంట్‌లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు నిర్వహించిన నృత్య ప్రదర్శనలు అందరినీ అలరించాయి. పిల్లల నృత్యాలకు అపార్ట్‌మెంట్ వాసులు చప్పట్లతో ఉత్సాహపరిచారు.భక్తిగీతాలు, నృత్యాలు, ఆనందోత్సాహాల నడుమ గణనాథుడిని నిమజ్జనానికి తరలించారు. తొమ్మిది రోజులపాటు కుటుంబ సభ్యులందరూ కలిసి పండుగను ఆనందంగా జరుపుకోవడంతో అపార్ట్‌మెంట్‌లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ వేడుకలు అందరిలో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించాయని అపార్ట్‌మెంట్ వాసులు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ బాధితులకు తక్షణ న్యాయం అందేలా చర్యలు చేపట్టాలి



నంద్యాల క్రైం, సెప్టెంబర్ 22, (రిపబ్లిక్ న్యూస్):
ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన బాధితులపై నమోదైన కేసుల్లో విచారణను వేగవంతం చేసి, బాధితులకు సకాలంలో న్యాయం అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్ తో కలిసి జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై నమోదైన కేసులు, వాటి విచారణ పురోగతి, బాధితులకు అందుతున్న సహాయం తదితర అంశాలపై సమీక్షించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన బాధితులకు ప్రభుత్వం అందిస్తున్న పరిహారం, ఇతర సహాయ చర్యలు సకాలంలో అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. కేసుల విచారణలో ఎటువంటి జాప్యం లేకుండా సంబంధిత శాఖల అధికారులు, పోలీసు అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. బాధితుల సమస్యలను సున్నితంగా పరిగణించి, వారికి అవసరమైన న్యాయపరమైన, ప్రభుత్వపరమైన సహాయాన్ని అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి ఉంచి, నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఖాదర్ బాషా, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివారెడ్డి, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.




ప్రత్యేక ఆకర్షణగా గణేష్ నగర్ వినాయకుడు

భక్త కన్నప్ప అలంకారంలో గణేష్ డి దర్శనం

రంగు రంగుల విద్యుత్ కాంతులతో భక్తులకు కనువిందు

శోభయాత్రలో మారుమ్రోగిన గణనాధుడి నినాదాలు -జేజేలతో భజరంగ సేన డ్యాన్స్ లతో భక్తుల హంగామా

కర్నూలు ప్రతినిధి,(రిపబ్లిక్ న్యూస్): కర్నూలు నగరంలో వందలాది భారి విగ్రహాలు, చిన్న చిన్న విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. మంగళవారం అంగరంగ వైభవంగా భక్తి శ్రద్ధలతో గణనాధుడు నిమజ్జనం నిర్వహించారు. నిమజ్జన వేడుకలకు వేలాదిమంది భక్తులు తరలిరాగా మంగళ వాయిద్యాలు, మేళతాళాల నడుమ విఘ్నరాజు శోభయాత్రగా బైలుదేరాడు. కాగా ఇందులో గణేష్ నగర్ వినాయకుడు భక్తులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గణేషుడిని రంగురంగుల విద్యుత్ దీప కాంతులతో అలంకరించారు. దీంతో ఆయన రూపం భక్తులకు కనువిందు చేసింది. అయితే తీవ్ర వర్షాభావ పరిస్థితుల్ల కారణంగా వేడెక్కిన వాతావరణం ఆదివారం కురిసిన వర్షం వల్ల నగరం మెత్తం చల్లబడింది. అలాగే వినాయక నిమజ్జన వేడుకలకు నీటి గండం ఏర్పడే పరిస్తితిలో అధికారుల చొరవతో ఆసమస్య కూడా తీరిపోగా భజరంగ్ సేన తమ వారు ఏర్పాటు చేసిన భక్తకన్నప్ప అవతారంలో గల వినాయకుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.ఈ సందర్భంగా గణేష్ నగర్ వినాయకుడికి పూజలు చేసి ఆనందాన్ని పంచుకున్నారు. విగ్రహం ఏర్పాటుచేసిన భజరంగ్ సేన బృందాన్ని పలువురు అభినందించారు.



రాయికల్ వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన జగిత్యాల నియోజకవర్గ బిజెపి ఇంచార్జ్ డా. బోగ శ్రావణి





రాయికల్ మండలం సెప్టెంబర్,22(రిపబ్లిక్ న్యూస్)

వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జగిత్యాల్ జిల్లా రాయికల్ మండలం మరియు పట్టణంలో ఏర్పాటు చేసిన పలు వినాయక మండపాలను బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జ్ డా. బోగ శ్రావణి సందర్శించారు.ఈ సందర్భంగా ఆయా మండపాల్లో కొలువుదీరిన శ్రీ విఘ్నేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరికీ శ్రీ వినాయక స్వామివారి ఆశీస్సులు లభించాలని, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, సంతోషం వెల్లివిరియాలని ఆమె ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో రాయికల్ మండల మరియు పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్లు, స్థానిక గ్రామ నాయకులు, యువత, మహిళలు, పార్టీ కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి బోయకొండ గంగమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలు

చౌడేపల్లి ప్రతినిధి సెప్టెంబరు 22 రిపబ్లిక్ న్యూస్



ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ బోయకొండ గంగమ్మ దేవస్థానంలో ఈ ఏడాది దసరా మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం తెలిపారు అక్టోబర్ 12 నుండి 20 వరకు ఈ వేడుకలు కన్నులపండువగా సాగనున్నాయన్నారు ఈ దసరా మహోత్సవాలలో పాల్గొనాలని భావించే ఉభయదారులు రూ. 5,116/-లు చెల్లించి అధికారిక రశీదు పొందవచ్చునన్నారు మరిన్ని వివరాలకు బోయకొండ కార్యాలయం నందు సంప్రదించాలని ఆయన కోరారు.

అంగన్వాడీ పౌష్టికాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజం



చౌడేపల్లి ప్రతినిధి సెప్టెంబర్ 22 రిపబ్లిక్ న్యూస్ అంగన్వాడి లో పంపిణీ చేసే పౌష్టికాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చునని ఐసిడిఎస్ సూపర్వైజర్ రాధమ్మ అన్నారు పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా మంగళవారం మండలంలోని దుర్గ సముద్రం పంచాయతీ బండమీద పల్లి అంగన్వాడీ కేంద్రంలో తల్లులు బాధితులకు పౌష్టికాహారం పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా వారు ప్రసంగిస్తూ ప్రభుత్వం పంపిణీ చేసే పౌష్టికాహారం వల్ల తల్లి బిడ్డలు ఆరోగ్యవంతమైన జీవితాన్ని అనుభవిస్తారన్నారు ప్రతినెల ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని తీసుకొని ఆరోగ్యవంతంగా ఉండాలని ఈ సందర్భంగా వారు అన్నారు అనంతరం పౌష్టికాహారం పై అవగాహన కల్పించారు ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి పరిధిలోని తల్లులు బాలింతలు కిశోర బాలికలు పాల్గొన్నారు

అంకుతోటపల్లిలో పారిశుద్ధ చర్యలు

పరిశీలించిన డిప్యూటీ ఎంపీడీవో గఫూర్

చౌడేపల్లి ప్రతినిధి సెప్టెంబర్ 22 రిపబ్లిక్ న్యూస్



మండలంలోని ఏ కొత్తకోట పంచాయతీ అంకుతోటపల్లిలో మంగళవారం డిప్యూటీ ఎంపీడీవో గఫూర్ పారిశుద్య చర్యలను పర్యవేక్షించారు గ్రామంలో గత కొంతకాలంగా నెలకొని ఉన్న కాలువ సమస్యను పరిష్కరించారు వ్యర్థపు నీటిని సజావుగా మళ్ళించేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా గ్రామస్తులకు సూచించారు కాలువలు ఆక్రమించడం కాలువలలో గల పైపులైను పగలగొట్టడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు అనంతరం గ్రామంలో పర్యటించి మంచినీటి సరఫరా విధానాన్ని పారిశుధ్య చర్యలను పంచాయతీ సెక్రటరీ నాగేంద్ర ను అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు

6వ జాతీయ ఫార్మాకోవిజిలెన్స్ వారోత్సవం సందర్భంగా వాక్‌థాన్..





రేణిగుంట సెప్టెంబర్ :22(రిపబ్లిక్ న్యూస్)

శ్రీ బాలాజీ మెడికల్ కాలేజ్, హాస్పిటల్ & రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, రేణిగుంటలోని ఫార్మకాలజీ విభాగం ఆధ్వర్యంలో 6వ జాతీయ ఫార్మాకోవిజిలెన్స్ వారోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 22న వాక్‌థాన్ నిర్వహించారు."ఫార్మాకోవిజిలెన్స్ ద్వారా ఔషధాల హేతుబద్ధమైన వినియోగాన్ని ప్రోత్సహిద్దాం సురక్షితమైన ఆరోగ్య సంరక్షణకు ఒక అడుగు" అనే థీమ్‌తో ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది.ఈ వాక్‌థాన్‌లో MBBS, BPT,నర్సింగ్ విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొని, సురక్షితమైన మరియు హేతుబద్ధమైన ఔషధ వినియోగం, ఔషధాల దుష్ప్రభావాల నివేదికపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో డీన్ డా. ఎం. హనుమంతరావు, డైరెక్టర్ డా. ఎం. నాగరాజు, జీజుూ డా. ఎం. నవీన్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. డా. పి. మాధవ్, ప్రొఫెసర్ & హెడ్, ఫార్మకాలజీ విభాగం వైస్-ప్రిన్సిపాల్, ఫార్మాకోవిజిలెన్స్ ప్రాముఖ్యతను వివరించారు.

సనాతన ధర్మం కాపాడటానికి శిశు మందిర్ విద్యాలయా భవనం నిర్మిస్తూన్నా రాయికల్, మండల దాతలు

శ్రీ సరస్వతీ శిశు మందిరం భవన నిర్మాణ పనులను పరిశీలించిన ప్రముఖులు





రాయికల్ మండలం సెప్టెంబర్ 22(రిపబ్లిక్ న్యూస్)

సనాతన ధర్మం కొరకు శిశు మందిర్ విద్యాలయాన్ని కొత్తగా మళ్లీ ఏర్పాటు చేయడానికి పట్టణవాసులు వివిధ గ్రామాల ప్రజలు సహకరించి నిర్మాణం జరుగుతున్న శిశుమందిరం మన సనాతన ధర్మాన్ని కాపాడడానికి రాయికల్ పట్టణ మండల వాసులు చందాల రూపంగా డబ్బులు పోగు చేసి సనాతన ధర్మాన్ని కాపాడటానికి ముందుకొచ్చిన పట్టణ మండల వాసులు జగిత్యాల జిల్లా రాయికల్ శ్రీ సరస్వతీ శిశు మందిరం భవన నిర్మాణ పనుల్లో భాగంగా భవన నిర్మాణ కమిటీ అధ్యక్షుడు బోడుగం మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు ప్రముఖులు భవన నిర్మాణ పనులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు శ్రీ మచ్చ నారాయణ, డా॥ తురగ రాజారెడ్డి, శ్రీ గాజెంగిఅశోక్, శ్రీ బొమ్మకంటి రాంగోపాల్, సరస్వతి విద్యాపీఠం శ్రీ బండారు కమలాకర్ రావు గారు, శ్రీ కుర్మ పెద్ద మల్లారెడ్డి , శ్రీ కడకుంట్ల ప్రభాకర్, శ్రీ మామిడాల లక్ష్మీనారాయణ, శ్రీ బిరుదరాజు సుభాష్ రాజు, శ్రీ చౌడారపు సతీష్, శ్రీ సింగు నరేష్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా భవన నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి, విద్యా సంస్థ అభివృద్ధికి అవసరమైన సహకారం, నిర్మాణ పనుల కొనసాగింపుపై చర్చించారు. శ్రీ సరస్వతీ శిశు మందిరం అభివృద్ధికి అందరూ సహకరించాలని ఈ సందర్భంగా వారు కోరారు.

రాయికల్ లో వినాయక నిమజ్జన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి శాంతియుతంగా శోభాయాత్ర లు నిర్వహించాలి

-భక్తులు, నిర్వాహకులు అధికారులకు సహకరించాలి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ లతో కలిసి ఏర్పాట్ల పరిశీలన



రాయికల్ మండలం సెప్టెంబర్,22(రిపబ్లిక్ న్యూస్)

భక్తి శ్రద్ధలతో జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో వినాయక నిమజ్జన వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. రాయికల్ పట్టణ శివారులోని వాగు వద్ద వినాయక నిమజ్జన వేడుకల కోసం మున్సిపల్, పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక ఇతర శాఖల ఆధ్వర్యంలో చేస్తున్న ఏర్పాట్లను మంగళవారం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ లతో కలిసి పరిశీలించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ వినాయక మండపాల నిర్వాహకులు తమ విగ్రహాలను భక్తి శ్రద్ధల మధ్య వేడుకలు నిర్వహిస్తూ వైభవంగా తరలించాలని సూచించారు. ప్రతి ఒక్క నిర్వాహకులు అధికారులకు పూర్తి స్థాయిలో సహకరించాలని ఎటువంటి సంఘటనలు జరగకుండా శోభయాత్ర, నిమజ్జనం వేడుకలు చేసుకోవాలని కోరారు.
అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పక్కా ప్రణాళికతో వేడుకలను విజయవంతం చేయాలని ఆదేశించారు. వినాయక నిమజ్జనానికి కావలసిన, స్టేజ్, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, వైద్య సేవలు, అగ్ని మాపక శాఖ, మత్స్యశాఖ, అధికారులు సేవలు అందించాలని, నిమజ్జన ప్రదేశాల్లో పారిశుధ్య పనులు చేయించాలని, భారీ క్రేన్లు, చిన్న క్రెన్ లు, గజ ఈతగాళ్ళు అవసరం మేరకు అందుబాటులో ఉంచుకోవాలని అవసరమైతే అదనంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పట్టణ వాసులతో పాటు భక్తులు, పిల్లలు తరలివచ్చే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నిమజ్జనం వేడుకలు భక్తులందరూ భక్తిశ్రద్ధలతో శాంతియుత వాతావరణంలో చేసుకోవాలని పిలుపునిచ్చారు.
ఈ పరిశీలనలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, డిఎస్పీ పురుషోత్తం రెడ్డి, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, ఎంపిడివో, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర ఆడబిడ్డకు ఘన సత్కారం

ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిన చంద్రబాబుకు కృతజ్ఞతలు

రమాదేవికి ఆత్మీయ కృతాభివందన సభ

భారీగా తరలివచ్చిన వడ్డెర సామాజికవర్గం



అనంతపురం ప్రతినిధి, సెప్టెంబర్ 22,(రిపబ్లిక్ న్యూస్):

అనంతపురం జిల్లా వడ్డెర సామాజికవర్గానికి చెందిన వడ్డె దళవాయి రమాదేవికి శాసనమండలి సభ్యురాలిగా అవకాశం దక్కడంతో వడ్డెర సామాజికవర్గంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. తమ సామాజికవర్గానికి చెందిన మహిళకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ అనంతపురం నగరంలో ఆత్మీయ కృతాభివందన సభను ఘనంగా నిర్వహించారు.

వడ్డెర ప్రజల సంక్షేమం కోసం ఆమె కృషి చేయాలి



బళ్లారి రోడ్డులోని ఎంవైఆర్ ఫంక్షన్ హాల్ వేదికగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వడ్డెర సామాజికవర్గానికి చెందిన నాయకులు, ప్రతినిధులు, కుల బంధువులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి రమాదేవికి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్సీగా ఆమెకు అవకాశం లభించడం వడ్డెర సామాజికవర్గానికి దక్కిన ప్రాతినిధ్యంగా పలువురు పేర్కొన్నారు.రమాదేవిని తమ ఇంటి ఆడబిడ్డగా అభివర్ణిస్తూ వడ్డెర సామాజికవర్గ ప్రతినిధులు ఆత్మీయంగా సత్కరించారు. సామాజికవర్గ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, వడ్డెర ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం ఆమె కృషి చేయాలని ఆకాంక్షించారు. శాసన మండలిలో వడ్డెర సామాజికవర్గ వాణిని వినిపించేందుకు ఈ అవకాశం ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి, కూటమి ప్రభుత్వానికి కార్యక్రమ నిర్వాహకులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది

రాష్ట్రవ్యాప్తంగా వడ్డెర సామాజికవర్గానికి సంబంధించిన నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఒకే వేదికపైకి రావడంతో సభలో సందడి నెలకొంది. రమాదేవికి లభించిన పదవితో అనంతపురం జిల్లాకు, వడ్డెర సామాజికవర్గానికి మరింత ప్రాధాన్యం లభించిందని పలువురు అభిప్రాయపడ్డారు.అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ రమాదేవికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా జీవితంలో మరింత చురుకుగా పనిచేస్తూ సామాజికవర్గంతో పాటు అన్ని వర్గాల ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. వడ్డెర సామాజికవర్గానికి సంబంధించిన సమస్యలు, అభివృద్ధి అవసరాలపై ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి కృతజ్ఞతలు



ఈ సందర్భంగా వడ్డెర సామాజికవర్గ నాయకులు మాట్లాడుతూ తమ సామాజికవర్గానికి రాజకీయంగా ప్రాతినిధ్యం కల్పించడంలో కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి కృతజ్ఞతలు తెలిపారు. రమాదేవి ఎమ్మెల్సీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం వడ్డెర ప్రజల సమస్యలను శాసనమండలి వేదికగా ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.కార్యక్రమంలో వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వర్, విజయవాడ పశ్చిమ ఏపీ పరిశీలకులు, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్లు, కూటమి నాయకులు, వడ్డెర సామాజికవర్గ రాష్ట్రస్థాయి ప్రతినిధులు, జిల్లాకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. రమాదేవికి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

నంద్యాల జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల మౌలిక వసతుల అభివృద్ధికి రూ.164 కోట్ల కేటాయింపు

రూ.550 కోట్లతో నంద్యాల పట్టణ రూపురేఖల్లో సమగ్ర మార్పు

నంద్యాల పట్టణాన్ని స్వచ్ఛ ఆరోగ్యకర నంద్యాల జిల్లాగా తీర్చిదిద్దడంలో ప్రజల భాగస్వామ్యం ఉండాలి

: జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా



నంద్యాల బ్యూరో, సెప్టెంబర్ 22 (రిపబ్లిక్ న్యూస్)

నంద్యాల జిల్లా సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా కలెక్టర్ మరియు నంద్యాల మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి రాజ కుమారి గణియా తెలిపారు. మంగళవారం నంద్యాల పట్టణ మున్సిపల్ టౌన్ హాల్ నందు ఏర్పాటు చేసిన హైబ్రిడ్ మాన్యుటి మోడల్ పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా రూ. 164 కోట్లు విలువైన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు కుప్పం నుంచి శంకుస్థాపన చేయనున్న కార్యక్రమానికి జిల్లా నుంచి హాజరైన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ప్రజా ప్రతినిధులు తదితర అధికారులు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ పథకం కింద జిల్లాలోని వివిధ మున్సిపాలిటీలకు రూ. 164 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించిందని, ఈ అభివృద్ధి పనులకు గౌరవ ముఖ్యమంత్రి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారన్నారు.

-నంద్యాల పట్టణం: రూ. 63 కోట్లు
- ధోన్ మున్సిపాలిటీ: రూ. 21 కోట్లు
-ఆళ్లగడ్డ మున్సిపాలిటీ: రూ. 21 కోట్లు
-ఆత్మకూర్ మున్సిపాలిటీ: రూ. 21 కోట్లు
-నందికొట్కూర్ మున్సిపాలిటీ: రూ. 21 కోట్లు
-బేతంచెర్ల నగర పంచాయతీ: రూ. 17 కోట్లు

రూ.550 కోట్లతో నంద్యాల పట్టణ సమగ్ర అభివృద్ధి

హెచ్ ఏ ఎంకింద కేటాయించిన రూ. 63 కోట్లతో పాటు అమృత్ 1.0, అమృత్ 2.0, 15వ ఆర్థిక సంఘం నిధులు, మైనారిటీ సంక్షేమ శాఖ, కాలుష్య నియంత్రణ మండలి, బి పి ఎస్/ఎల్ఆర్ఎస్ తదితర నిధులను అనుసంధానం చేస్తూ నంద్యాల పట్టణంలో సుమారు రూ. 550 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ నిధుల మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ గారికి జిల్లా కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు.

ప్రధాన అభివృద్ధి పనులు

మంచినీటి సరఫరా:

నంద్యాల పట్టణంలోని ప్రతి ఇంటికీ నిరంతర, స్వచ్ఛమైన తాగునీటిని అందించేలా నీటి సరఫరా వ్యవస్థను బలోపేతం చేయనున్నారని అన్నారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను పటిష్టం చేయడంతో పాటు అదనపు వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు ఉంటుందన్నారు.

రహదారులు, కాలువల అభివృద్ధి:

పట్టణంలోని అవసరమైన ప్రాంతాల్లో నాణ్యమైన సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, అమృత్ పథకం కింద నూతన సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేసి మురుగునీటిని శుద్ధి చేయడంతో పాటు, శుద్ధి చేసిన నీటిని అవసరమైన విధంగా వినియోగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా పార్కుల అభివృద్ధి, పట్టణ సుందరీకరణ పనులు చేపడుతామన్నారు. నంద్యాల పట్టణాన్ని స్వచ్ఛ నంద్యాల ఆరోగ్యకర నంద్యాల జిల్లాగా తీర్చిదిద్దడంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని తెలిపారు. 100 శాతం ఇంటింటి చెత్త సేకరణకు ప్రజలు సహకరించాలని, చెత్తను రోడ్లపై, డ్రైనేజీ కాలువల్లో వేయకుండా మున్సిపల్ సిబ్బందికి అందించాలని అన్నారు. ఇంటింటి నుంచి సేకరించే చెత్తను శాస్త్రీయ పద్ధతుల్లో ప్రాసెస్ చేసి వర్మీ కంపోస్ట్, సేంద్రీయ ఎరువులను తయారు చేసి కిచెన్ గార్డెన్లు, టెర్రస్ గార్డెన్లతో పాటు రైతులకు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.అభివృద్ధి పనులన్నింటినీ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు సమన్వయంతోపర్యవేక్షించాలని ఆదేశించారు. పనులను పురోగతిన ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ,ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు సభ్యులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రత్యేక దృష్టి సారించాలి

అకడమిక్ ప్రగతిపై నిరంతర పర్యవేక్షణతో మెరుగైన ఫలితాలు సాధించాలి

జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



నంద్యాల బ్యూరో, సెప్టెంబర్ 22 (రిపబ్లిక్ న్యూస్)

జిల్లాలో పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంపొందించడంతో పాటు విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి విద్యాశాఖ అధికారులను, ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను ఆదేశించారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని బొమ్మల సత్రం సమీపంలోని మానవ వనరుల కేంద్రంలో నిర్వహించిన ఎంఈఓలు జిల్లా స్థాయి వన్‌డే ఓరియంటేషన్ కార్యక్రమం సందర్భంగా విద్యాశాఖ అకడమిక్ ప్రగతిపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడంతో పాటు విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంఈఓలు, ఉపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాలలకు క్రమం తప్పకుండా హాజరు కాని విద్యార్థులను గుర్తించి, వారి కుటుంబ పరిస్థితులను పరిశీలించి, తల్లిదండ్రులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఎలాంటి కారణాలతో పాఠశాలకు దూరమవుతున్నారో గుర్తించి, వారిని తిరిగి పాఠశాలలకు తీసుకువచ్చి, నిరంతర హాజరు ఉండేలా అవసరమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ 'ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదు' అనే లక్ష్యంతో పనిచేయాలని స్పష్టం చేశారు. అకడమిక్ ప్రగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేలా ఉపాధ్యాయులు వినూత్న బోధనా పద్ధతులను అవలంబించాలని కలెక్టర్ సూచించారు. మండల విద్యాశాఖ అధికారులు పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శించి విద్యార్థుల హాజరు, అభ్యసన స్థాయిలు, విద్యా ఫలితాలను సమీక్షిస్తూ అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని ఆదేశించారు. సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేసి నంద్యాల జిల్లాను విద్యా ప్రమాణాలు, విద్యార్థుల హాజరు, అకడమిక్ ఫలితాల్లో మరింత ముందంజలో నిలిపేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డిఇఓ జనార్దన్ రెడ్డి, ఐసిడిఎస్ పిడి లీలావతి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ

జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్ -ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజలకు మెరుగైన ట్రాఫిక్ సేవలు అందించే దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశాలు

నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోండి





నంద్యాల క్రైం, సెప్టెంబర్ 22, (రిపబ్లిక్ న్యూస్): స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి, స్టేషన్‌ను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

స్టేషన్‌లో పట్టుబడిన వాహనాలకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసి, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. అదేవిధంగా యాక్సిడెంట్ కేసుల దర్యాప్తు, వాటి ప్రస్తుత స్థితిగతులపై ఆరా తీశారు. అనంతరం స్టేషన్‌లోని పలు ముఖ్యమైన రికార్డులను జిల్లా ఎస్పీ పరిశీలించారు. సిబ్బంది వివరాలు, విధుల కేటాయింపు, డ్యూటీ రోస్టర్స్, జనరల్ డైరీ, ఎఫ్ఐఆర్ ఇండెక్స్ తదితర రికార్డులను కేసుల దర్యాప్తు వాటి స్థితిగతులను పరిశీలించారు. అలాగే నంద్యాల పట్టణంలోని ముఖ్యమైన ట్రాఫిక్ పాయింట్లు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తీసుకుంటున్న చర్యలు, ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి అమలు చేస్తున్న విధానాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ఎన్ఫోర్స్మెంట్ చర్యల వివరాలను కూడా జిల్లా ఎస్పీ గారు పరిశీలించి, నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. నంద్యాల పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడటం, ప్రమాదాల నివారణ, ప్రజలకు మెరుగైన ట్రాఫిక్ సేవలు అందించే దిశగా నిరంతరం చర్యలు చేపట్టాలని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సుబ్రహ్మణ్యంకు జిల్లా ఎస్పీ పలు సూచనలు, సలహాలు అందించారు. ప్రజల భద్రతకు, సురక్షితమైన ట్రాఫిక్ నిర్వహణకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని జిల్లా ఎస్పీ తెలిపారు.

గోరుకల్లు పరిస్థితిపై జిల్లా యంత్రాంగం అప్రమత్తం

ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత.. క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ

వెంట్‌గేట్ ఘటనపై సమగ్ర విచారణ.. బాధ్యులపై కఠిన చర్యలు: జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా





నంద్యాల బ్యూరో, సెప్టెంబర్ 22 (రిపబ్లిక్ న్యూస్)

పాణ్యం మండలం గోరుకల్లు గ్రామంలో నెలకొన్న పరిస్థితులపై జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. మంగళవారం ఆమె గోరుకల్లు గ్రామాన్ని స్వయంగా సందర్శించి, అక్కడి పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, పరిస్థితులను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గోరుకల్లు రిజర్వాయర్‌కు సంబంధించిన వెంట్‌గేట్‌ను ఎవరు ఎత్తారు, ఎవరి ద్వారా గేట్ తెరవబడింది అనే అంశంపై సమగ్ర విచారణ కొనసాగుతోందని కలెక్టర్ తెలిపారు. విచారణలో వాస్తవాలు వెలుగులోకి వచ్చిన అనంతరం బాధ్యులుగా తేలిన వారిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వరదలు, నీటి ప్రవాహం తదితర కారణాలతో ఎక్కడెక్కడ నష్టం వాటిల్లిందో ఆయా ప్రాంతాలను గుర్తించి, పునరుద్ధరణ పనులను వెంటనే చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభావిత ప్రాంతాల్లో పారిశుధ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతూ, అవసరమైన మేరకు బ్లీచింగ్ పౌడర్‌ను సక్రమంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి (డిపిఓ)ను ఆదేశించినట్లు పేర్కొన్నారు. పంటలు నష్టపోయిన గ్రామాల్లో ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు అధికారుల బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి, నష్టం మరియు ప్రజల సమస్యలపై సమగ్ర నివేదికను సమర్పించేలా అధికారులకు ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. గోరుకల్లు, పరిసర ప్రాంతాల్లో నీటి మట్టం సుమారు మూడు అడుగుల మేర ఉన్న నేపథ్యంలో పరిస్థితిని క్షేత్రస్థాయిలో నిరంతరం పరిశీలించి, అవసరమైన చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, అత్యవసర పరిస్థితులు ఏర్పడిన వెంటనే ప్రజలకు తక్షణ సహాయం అందించేలా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల భద్రతకు ఎటువంటి ముప్పు కలగకుండా జిల్లా యంత్రాంగం పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపడుతోందని తెలిపారు.



ఎస్సీ, ఎస్టీ బాధితులకు సకాలంలో న్యాయం అందేలా చర్యలు

పెండింగ్ కేసుల విచారణ వేగవంతం చేయాలి

సమస్యల పరిష్కారంపై ప్రతి 15 రోజులకు సమీక్ష నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి

నంద్యాల బ్యూరో, సెప్టెంబర్ 22 (రిపబ్లిక్ న్యూస్)

ఎస్సీ, ఎస్టీలపై నమోదైన కేసుల్లో విచారణను వేగవంతం చేసి, బాధితులకు సకాలంలో న్యాయం అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యలను సున్నితంగా పరిగణించి, ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించి, చట్టపరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధ్యక్షతన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై నమోదైన కేసులు, వాటి విచారణ పురోగతి, బాధితులకు



అందుతున్న న్యాయపరమైన, ప్రభుత్వపరమైన సహాయం తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో ప్రస్తావించిన సమస్యలను అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించి, పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో గుర్తించిన సమస్యలపై ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్ష నిర్వహించి, తీసుకున్న చర్యలు మరియు పురోగతిని పరిశీలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. బాధితులకు న్యాయం జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

సఫాయి కర్మచారుల సమస్యలపై ప్రత్యేక దృష్టి

సఫాయి కర్మచారుల సమస్యలపై చర్చిస్తూ, వారికి పిఎఫ్, ఈ ఎస్ ఐ తదితర సామాజిక భద్రతా ప్రయోజనాలపై పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలను అర్హులైన కార్మికులందరూ సద్వినియోగం చేసుకునేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సానిటేషన్ వర్కర్లకు నిబంధనల ప్రకారం పని దినాలు, సెలవులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొన్ని గ్రామ పంచాయతీల్లో నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ జీతాల చెల్లింపులో జాప్యం జరుగుతున్న అంశంపై స్పందిస్తూ, పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

తాగునీటి సౌకర్యాల కల్పనకు చర్యలు

ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా అవసరమైన ప్రాంతాల్లో ఆర్వో వాటర్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. నంద్యాల పట్టణ పరిధిలో ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు అనువైన స్థలాల గుర్తింపులో ఎదురవుతున్న ఇబ్బందులను అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. చిన్న విస్తీర్ణంలో ఉన్న స్థలాలను కూడా పరిశీలించి, సాధ్యమైన చోట్ల తాగునీటి సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి: ఎస్పీ

జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ బాధితుల సమస్యలను సున్నితంగా పరిగణించి, వారికి అవసరమైన న్యాయపరమైన, ప్రభుత్వపరమైన సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, నిబంధనల ప్రకారం త్వరితగతిన విచారణ పూర్తి చేసి పరిష్కరించేలా సంబంధిత రాణూలను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఖాదర్ బాషా, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివారెడ్డి, ఆర్డీఓలు విశ్వనాథ్, నరసింహులు, నరేంద్రనాథ్ రెడ్డి, డివియంసీ కమిటీ సభ్యులు నాగరాజు, కాశన్న, రవికాంత్ బాబు, రమేష్ నాయక్, నాగ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com